విలేకరులు కావలెను
భారత్ BHARATH REPORTER లపోర్టర్
RNI.APTEL/16364/2023 తెలుగు దినపత్రిక
తెలుగు రాష్ట్రాలలో వెలువడుతున్న భారత్ రిపోర్టర్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను.తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికీ, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికీ ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించండి:
7668886666

Postal Licenced No: HDP/010/2024-2026
భారత
తెలుగు దినపత్రిక
BHARAT REPORTER లపోర్టర్
BHARAT REPORTER RNI.APTEL/2023/88573 TELUGU DAILY NEWS PAPER
సంపుటి : 03 సంచిక : 232 ఎడిటర్.. కొట్లపల్లి ఫాజియా పేజిలు : 08, వెల . రూ. 1/- ఆదివారం -29 - నవంబర్ - 2026

పిఠాపురంలో అగ్నిప్రమాదం.. పవన్ కల్యాణ్ విచారం



పిఠాపురం మండలం నరసింగపురం గ్రామంలో తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ పాడి రైతుకి చెందిన పశువులు, కోళ్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు.

అమరావతి, నవంబరు 28 : పిఠాపురం మండలం నరసింగపురం గ్రామంలో తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. మిగతా..2లో

డీలిమిటేషన్‌తో తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 175కు పెరుగుతాయి



మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ప్రజలతోపాటు రాజకీయ పార్టీలకు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

హైదరాబాద్, నవంబర్28: మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ప్రజలతోపాటు రాజకీయ పార్టీలకు తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పిలుపునిచ్చారు. వారి ఆశయాల మేరకు మహిళలకు విద్యావకాశాలతో పాటు , వారికి రాజకీయ అభ్యున్నతి కూడా ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన చేస్తున్నారని తెలిపారు. అయితే మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదంటూనే అడ్డుకుంటున్నారంటూ ప్రతిపక్ష పార్టీల వైఖరిపై మండిపడ్డారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన.. మిగతా..2లో

మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే
నిజమైన సాధికారత సాధ్యం



- మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏపీ హోంమంత్రి అనిత కీలక వ్యాఖ్యలు
- చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యం దక్కాలని వ్యాఖ్య
- మహిళలు నిర్ణయాధికారులుగా ఎదగాలన్న హోంమంత్రి

అమరావతి : మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం నవంబర్ 30న ప్రారంభం కానున్న లోక్‌సభ ప్రత్యేక సమావేశాల్లో మహిళా

మోదీ నేతృత్వంలో నిర్ణయాత్మక అడుగు పడబోతోంది..
గత తప్పిదాలు పునరావృతం చేయొద్దు

- మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులపై చంద్రబాబు కీలక ట్వీట్
- ఏకాభిప్రాయంతో బిల్లులను ఆమోదించాలని పార్టీలకు పిలుపు
- సీట్ల పెంపుతో ఏపీ లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని వెల్లడి
- డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల వాటాకు ఢోకా ఉండదన్న ఏపీ సీఎం



అమరావతి : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) తో పాటు మహిళా రిజర్వేషన్ల ప్రక్రియ మహిళా సాధికారత దిశగా పడబోతున్న ఒక నిర్ణయాత్మక అడుగు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ రెండు కీలక బిల్లులను అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయంతో ఆమోదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. గతంలో జరిగిన తప్పిదాలను పునరావృతం చేయకుండా, రాజకీయాలకు అతీతంగా ఈ బిల్లులకు మద్దతు తెలపాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ బిల్లులను వ్యతిరేకించడం అంటే మహిళలకు దక్కాల్సిన న్యాయాన్ని నిరాకరించడమేనని

రామాయపట్నం రిఫైనరీకి బీపీసీఎల్ ఆమోదం..
నారా లోకేశ్ స్పందన



- రామాయపట్నం బీపీసీఎల్ రిఫైనరీ ఆమోదంపై మంత్రి నారా లోకేశ్ హర్షం
- సుమారు రూ.1.27 లక్షల కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్ట్ ఏర్పాటు
- దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో విస్తృతంగా పెరగనున్న ఉద్యోగావకాశాలు
- వార్షికంగా 9 మిలియన్ మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ ప్రాసెసింగ్ సామర్థ్యం
- 2032 జూలై నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ప్రాజెక్ట్

దేశంలో ప్రస్తుతం నియంత పాలన
నడుస్తోంది'- కేంద్రంపై రాహుల్ విమర్శలు



- దేశంలో ప్రస్తుతం నియంత పాలన నడుస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు

ఢిల్లి : దేశంలో ప్రస్తుతం నియంత పాలన నడుస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అంబానీ, అదానీ కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును తీసుకొస్తున్న నేపథ్యంలో రాహుల్ దిల్లీలో ప్రసంగించారు. "ప్రస్తుతం కేంద్రం తెస్తున్న డీలిమిటేషన్ బిల్లు సరికాదు. సీట్ల సంఖ్య పెంపులో సామాజిక న్యాయం పాటించాలి. డీలిమిటేషన్ కమిషన్‌ను కేంద్రం పట్టించుకోవట్లేదు.

డీలిమిటేషన్ బిల్లుపై బీజేపీ హర్షం
అన్ని పార్టీలు మద్దతు తెలపాలని అమిత్ షా పిలుపు

- భారతీయ 'నారీశక్తి'కి ఇచ్చిన హామీని నెరవేర్చే సమయం ఆసన్నమైందని బీజేపీ తెలిపింది.
- ఈ కేంద్ర కేబినెట్ ఆమెదం తెలపడం దేశచరిత్రలో ఒక మైలురాయని పేర్కొంది.



ఢిల్లి : డీలిమిటేషన్ బిల్లు కేవలం చట్టపరమైన సంస్కరణ మాత్రమే కాదని, దేశ నిర్మాణంలో మహిళలకు సముచితస్థానం కల్పించే నిర్ణయాత్మక అడుగు అని బీజేపీ పేర్కొంది. భారతీయ 'నారీశక్తి'కి ఇచ్చిన హామీని నెరవేర్చే సమయం ఆసన్నమైందని తెలిపింది. డీలిమిటేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం దేశచరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయి అని బీజేపీ తన ఎక్స్ ఖాతాలో పేర్కొంది. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు 50శాతం పెరిగి, పార్లమెంటు ప్రాతినిధ్యం విస్తృతం అవుతుందని తెలిపింది. అంతేకాకుండా, 2029 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ల అమలుకు ఇది మార్గం సుగమం చేస్తుందని బీజేపీ పేర్కొంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ లు 'ఎక్స్' వేదికగా పోస్టులు చేశారు. రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లను 50శాతం పెంచేందుకు ఉద్దేశించిన మిగతా..2లో

మహిళా రిజర్వేషన్ల అమలును ఏ పార్టీ కూడా అడ్డుకోలేదు

లిమిటేషన్-మహిళా రిజర్వేషన్ బిల్లును ఈనెల 30న లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ప్రధాని స్పందించారు.



ఢిల్లి : లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేసి తీరుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న పార్టీలు దాన్ని ఎన్నటికీ అడ్డుకోలేవని తేల్చిచెప్పారు. పార్లమెంట్ ముందు డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులు ముందుకు రానున్న నేపథ్యంలో ఎక్స్ వేదికగా మోదీ వీడియో పోస్టు చేశారు. దేశంలోని 'నారీ శక్తి'కి ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. నారీ శక్తికి సాధికారత కల్పించాలనే తమ సంకల్పం చెక్కుచెదరలేదని, మహిళా రిజర్వేషన్ల అమలుకు ఎదురయ్యే ప్రతి అడ్డంకిని కచ్చితంగా తొలగిస్తామన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇస్తున్న వారిలో ఉత్సాహం రెట్టింపుగా ఉందన్నారు. తమ ధైర్యం అజేయమని, తమ సంకల్పం దృఢమైనదని పేర్కొన్నారు. త్వరలోనే మహిళా రిజర్వేషన్ల అమల్లోకి వస్తాయని మిగతా..2లో

తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం..
జగ్గారెడ్డి ఇంటికి హరీశ్ రావు

- జగ్గారెడ్డి నివాసానికి వెళ్లి నూతన దంపతులను ఆశీర్వదించిన హరీశ్ రావు
- సుమారు 21 ఏళ్ల తర్వాత తొలిసారి ఫ్యామిలీ ఫంక్షన్‌లో కలిసిన నేతలు
- 2004లో హరీశ్ చాంబర్‌లోనే భోజనం చేసేవాళ్లమని గుర్తుచేసుకున్న జగ్గారెడ్డి
- కూతురి పెళ్లికి పిలవలేకపోయా.. కుమారుడి వేడుకకు పిలిచానన్న కాంగ్రెస్ నేత
- తమ భేటీ వెనుక ఎలాంటి రాజకీయాలు, అంతరార్థాలు లేవని స్పష్టీకరణ

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సంగారెడ్డిలోని

తెలంగాణలో 17 నుంచి 26కు పెరగనున్న ఎంపీ సీట్ల సంఖ్య..
డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

- ఎక్స్ వేదికగా కీలక నిర్ణయాన్ని వెల్లడించిన కేటీఆర్
- బిల్లుకు అనుకూలంగా ఓటు వేయనున్న బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు
- తెలంగాణ లోక్‌సభ స్థానాల సంఖ్య 17 నుంచి 26కు పెరిగే అవకాశం
- 2051 వరకు రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా మారకుండా రక్షణపై హర్షం
- డీఎంకే బాటలోనే మద్దతు ప్రకటించిన తెలంగాణ ప్రధాన ప్రతిపక్షం



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న సవరించిన నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు అనుకూలంగా తమ పార్టీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఓటు వేస్తారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. డీలిమిటేషన్ అంశంపై తమ వైఖరి ఎప్పుడూ స్పష్టంగానే ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యంలో ఎలాంటి తగ్గుదల ఉండకూడదని, తెలంగాణకు జరిగే ఏ అన్యాయాన్నీ సహించేది లేదని తేల్చిచెప్పారు. 2051 వరకు అంతర్రాష్ట్ర ప్రాతినిధ్య నిష్పత్తి మారకుండా రక్షణ కల్పించాలనేది తమ డిమాండ్ అని గుర్తుచేశారు. అన్ని రాష్ట్రాల్లో సీట్లను 50 శాతం సమానంగా పెంచాలన్న తాజా ప్రతిపాదన తమ ఆందోళనలను పరిష్కరిస్తోందని తెలిపారు. ఈ సవరించిన బిల్లు ఆమోదం పొందితే తెలంగాణ లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 17 నుంచి ఏకంగా 26కు పెరుగుతుందని కేటీఆర్ వివరించారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయడానికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉన్నామని, దానికి నియోజకవర్గాల పునర్విభజన మార్గం సుగమం చేస్తోందని అన్నారు. కాగా, తమిళనాడులోని డీఎంకే సైతం తమ ప్రధాన డిమాండ్లను ఆమోదించినందుకుగానూ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ వెనువెంటనే బీఆర్ఎస్ కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకోవడం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.

తెలంగాణలో రాష్ట్రపతి పాలన తప్పదు: బీజేపీ
రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు



- 2029లో లోక్‌సభతో పాటే అసెంబ్లీ ఎన్నికలూ ఉంటాయన్న లక్ష్మణ్
- డీలిమిటేషన్‌తో అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంపు తథ్యమన్న ఎంపీ
- 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లు 2027లో ప్రవేశపెట్టే అవకాశం ఉందన్న బీజేపీ నేత
- దక్షిణాదికి నష్టం జరగకుండానే నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందన్న లక్ష్మణ్

హైదరాబాద్: తెలంగాణలో శాసనసభ గడువు ముగిశాక, సుమారు ఆరు నెలల పాటు రాష్ట్రపతి పాలన విధించే అవకాశాలున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కన్వీనర్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2028 డిసెంబరుతో ప్రస్తుత అసెంబ్లీ గడువు

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ తెలుగు దినపత్రిక
BHARAT REPORTER అపోర్టర్

మొదటి పేజీ తరువాయి

మోదీ నేతృత్వంలో నిర్ణయాత్మక అడుగు పడబోతోంది..

గత తప్పిదాలు పునరావృతం చేయొద్దు

ఆయన అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల అంశంలో ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. 1986లోనే స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దాదాపు 60 శాతం సీట్లు మహిళలకే దక్కాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ రాష్ట్ర అసెంబ్లీ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి అధికారిక తీర్మానాన్ని పంపిందని వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలను ప్రస్తావిస్తూ సీఎం చంద్రబాబు కీలక విశ్లేషణ చేశారు. దేశవ్యాప్తంగా సీట్ల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ప్రతి రాష్ట్రం వాటా సురక్షితంగా ఉంటుందని, తద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం చెక్కుచెదరకుండా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పెంపు అమల్లోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌లోని లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 25 నుంచి 38కి పెరుగుతుందని ఆయన వెల్లడించారు. జనాభా ప్రాతినిధ్యంపై గణాంకాలను వివరిస్తూ.. 1971లో ఒక పార్లమెంట్ సభ్యుడు సగటున 10 లక్షల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారని, నేడు ఆ సంఖ్య దాదాపు 27 లక్షలకు చేరిందని సీఎం తెలిపారు. డీలిమిటేషన్ ద్వారా సీట్లు పెరిగితే ఈ నిష్పత్తి సుమారు 18 లక్షలకు తగ్గుతుందని, ఫలితంగా ప్రజాప్రతినిధులు ప్రజలకు మరింత అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేసే వీలు కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే

నిజమైన సాధికారత సాధ్యం

ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆమె సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. "మహిళా సాధికారత కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకూడదు. రాజకీయాల్లోనూ మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి" అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తోందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకురానుండటం శుభపరిణామమని అనిత పేర్కొన్నారు. "దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే నిర్ణయాల్లో మహిళలు భాగస్వాములుగా మాత్రమే కాకుండా నిర్ణయాధికారులుగా ఎదగాలి. మహిళలు మార్పులో భాగం కావాలి.. మార్పుకు మార్గదర్శకులు కావాలి" అని ఆమె ఆకాంక్షించారు. చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యం పెరిగినప్పుడే ప్రజాస్వామ్యం మరింత పరిపుష్టమవుతుందని, కేంద్రం తీసుకుంటున్న ఈ చారిత్రక నిర్ణయం దేశవ్యాప్తంగా మహిళల్లో సరికొత్త విశ్వాసాన్ని నింపుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

తెలంగాణ రాజకీయాల్లో

ఆసక్తికర పరిణామం.. జగ్గారెడ్డి ఇంటికి హరీశ్ రావు

కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి నివాసానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ అగ్రనేత తన్నీరు హరీశ్ రావు విచ్చేశారు. జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయిరెడ్డి, కోడలు పాలక్ పటేల్ నిర్వహించిన సత్యనారాయణ వ్రతం సందర్భంగా వారిని ఆశీర్వదించేందుకు ఆయన నేరుగా జగ్గారెడ్డి ఇంటికి వెళ్లారు. ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్న వీరిద్దరూ సుమారు 21 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒకరినొకరు కలుసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించిన అనంతరం జగ్గారెడ్డి, హరీశ్ రావులు కాసేపు ఆప్యాయంగా ముచ్చటించారు. అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 2004లో హరీశ్ రావు తొలిసారి మంత్రిగా ఉన్నప్పుడు తాను ఆయనను కలిసి ఆయన చాంబర్‌లోనే భోజనం చేసేవాళ్లమని గుర్తుచేశారు. ఆ తర్వాత తాను కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు హరీశ్ రావును కలవలేదన్నారు. గత పదేళ్లు హరీశ్ మంత్రిగా, తాను ఎమ్మెల్యేగా కొనసాగినప్పటికీ ఎన్నడూ కలవలేకపోయానని తెలిపారు. కూతురి పెళ్లికి హరీశ్‌ను పిలవలేకపోయానని, అయితే ఈసారి కుమారుడి వేడుకను మిస్ కావద్దని ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు జగ్గారెడ్డి చెప్పారు. తమ కలయిక వెనుక ఎలాంటి రాజకీయాలు, మతలబులు లేవని స్పష్టం చేశారు. హరీశ్ రావు బీఆర్ఎస్‌లో అగ్రనేత అని, తాను కాంగ్రెస్‌లో ఒక స్థాయి నాయకుడినని పేర్కొన్నారు. రాజకీయాలు వేరని, తాము ఎప్పుడూ వ్యక్తిగతంగా విమర్శించుకోలేదని తెలిపారు. హరీశ్ రావు వెంట మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, డీసీఎంఎస్ ఛైర్మన్ శివకుమార్ ఉన్నారు.

తెలంగాణలో రాష్ట్రపతి పాలన తప్పదు

బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు

లోక్‌సభ ఎన్నికలతో పాటే రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరిగే సూచనలున్నాయని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో పాలనాపరమైన అవసరాల దృష్ట్యా రాష్ట్రపతి పాలన అనివార్యం కావచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానాన్ని దశలవారీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని లక్ష్మణ్ తెలిపారు. ఇందులో భాగంగా 2027లో 'జమిలి ఎన్నికల' బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ఆలోచన ఉందని చెప్పారు. తొలి దశలో భాగంగా, అసెంబ్లీ గడువు ఏడాది అటూఇటూగా ఉన్న 17 రాష్ట్రాలకు లోక్‌సభతో కలిపి ఎన్నికలు నిర్వహించవచ్చని, ఆ జాబితాలో తెలంగాణ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. తరచూ ఎన్నికల వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని, బోధన కుంటుపడుతోందని, ఈ సమస్యల పరిష్కారానికే జమిలి ఎన్నికలు అవసరమని ఆయన అన్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన), మహిళా రిజర్వేషన్ బిల్లులు ఆమోదం పొందుతాయని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. డీలిమిటేషన్‌పై కొన్ని వర్గాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రస్తుతం ఉన్న అసెంబ్లీ సీట్ల సంఖ్యకు అనుగుణంగా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్లు పెంచాలని కేంద్రం నిర్ణయించిందని, దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదని హామీ ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించడం వల్లే ఓట్ల సంఖ్య తగ్గిందన్నారు. హైదరాబాద్‌లో దాదాపు 45 శాతం బోగస్ ఓట్లు తొలగించారని, దీనిపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణల్లో పసలేదని, ఆధారాలు చూపడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాగా, ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో సైకిల్ యాత్ర నిర్వహించనున్నట్లు లక్ష్మణ్ తెలిపారు.

దేశంలో ప్రస్తుతం నియంత పాలన నడుస్తోంది'

కేంద్రంపై రాహుల్ విమర్శలు

ఈవీఎంలు, పోలింగ్ ప్రక్రియను ఆక్రమిస్తున్నారు. మోదీ, అమిత్ షా, అంబానీ, అదానీ కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నారు. దేశంలో ప్రస్తుతం నియంత పరిపాలన నడుస్తోంది. నియంత పరిపాలన గురించి ప్రజలంతా తెలుసుకోవాలి. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలు నకిలీవి, ప్రధాని కూడా నకిలీ వ్యక్తే. ఓటు చోరీ అంశంపై జ్ఞానేశ్‌కుమార్‌ను చాలాసార్లు ప్రశ్నించాం" అని రాహుల్ గాంధీ విమర్శించారు.

డీలిమిటేషన్ బిల్లుపై బీజేపీ హర్షం

అన్ని పార్టీలు మద్దతు తెలపాలని అమిత్ షా పిలుపు



132వ రాజ్యాంగ సవరణ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని అమిత్ షా ఎక్స్ వేదికగా కోరారు. శుక్రవారం కేంద్ర కేబినెట్ ఈ బిల్లుకు ఆమోదం తెలపడంతో దేశంలోని మహిళల దశాబ్దాల నిరీక్షణకు తెరపడనుందని పేర్కొన్నారు. నారీ శక్తి వందన్ చట్టం ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం ఇప్పుడు వాస్తవం అవుతుందని ఆయన చెప్పారు. పాలనలో మహిళలను బలమైన భాగస్వాములుగా మార్చే ఈ చారిత్రాత్మక చొరవకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. ఇదిలా ఉండగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లను తమ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని చెప్తూ, ఎక్స్ లో ఓ వీడియోను పోస్ట్ చేశారు. దీనిని వ్యతిరేకించే పార్టీలు ఏవీ ఆపలేవని ఆయన వ్యాఖ్యానించారు. ఆ వీడియో సందేశాన్ని నితిన్ నబీన్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేస్తూ, మహిళా సాధికారత అంటే 'మోదీ గ్యారెంటీ' అనే వాఖ్యను చేర్చారు.

మరిన్ని రాష్ట్రాల నుంచి మద్దతు

మరోవైపు దేశంలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల బిల్లులకు పార్లమెంట్ ఆమోదం పొందడానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్న వేళ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశం కానుండగా డిలిమిటేషన్ మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా పలు విపక్షాలు నిర్ణయం తీసుకుంటున్నాయి. ఈ మేరకు తమిళనాడుకు చెందిన డీఎంకే, తెలంగాణకు చెందిన బీఆర్ ఎస్ కేంద్రం తెస్తున్న నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల బిల్లులకు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించాయి. అలాగే మహారాష్ట్రకు చెందిన శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్ సీపీ (ఎస్‌పీ), పార్లమెంటులో డీలిమిటేషన్‌కు అనుసంధానమైన మహిళా కోటాకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకుందని సమాచారం. అటు కేంద్రం కూడా ఈసారి మహిళా రిజర్వేషన్ల బిల్లును ఏ శక్తీ అడ్డుకోలేదని చెబుతోంది.

రామాయపట్నం రిఫైనరీకి బీపీసీఎల్ ఆమోదం.. నారా లోకేశ్ స్పందన

మొదటి పేజీ తరువాయి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నంలో అత్యాధునిక రిఫైనరీ ఏర్పాటుకు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) బోర్డు ఆమోదం తెలపడంపై రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంతో పాటు రిఫైనింగ్ సామర్థ్యాన్ని విస్తరించడంలో 9 ఎంఎంటీపీఏ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణ ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి, భారీగా ఉద్యోగాల కల్పనకు ఈ రిఫైనరీ ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా నిలుస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు బీపీసీఎల్ తీసుకున్న నిర్ణయాన్ని తెలియజేసే సీఎన్‌బీసీ టీవీ18 మీడియా సంస్థ కథనాన్ని ఆయన రీపోస్ట్ చేస్తూ తన అభిప్రాయాలను పంచుకున్నారు. సీఎన్‌బీసీ టీవీ18 కథనం ప్రకారం, ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీపీసీఎల్ బోర్డు శనివారం (నవంబర్ 28) సమావేశమై రామాయపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ నిర్మాణానికి లాంఛనంగా ఆమోదం తెలిపింది. దాదాపు రూ.1,26,656 కోట్ల అంచనా వ్యయంతో ఈ మెగా ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ అమల్లోకి రావడానికి కేంద్ర క్యాబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ (సీసీఈఏ), ఇతర చట్టబద్ధమైన, నియంత్రణ సంస్థల ఆమోదాలు అవసరం కానున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను బీపీసీఎల్ తన పూర్తిస్థాయి అనుబంధ సంస్థ ద్వారా అభివృద్ధి చేయనుంది. దీని సాంకేతిక సామర్థ్యాలను పరిశీలిస్తే, ముడి చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 9 మిలియన్ మెట్రిక్ టన్నులుగా (9 వీమ్మీూా) ఉండనుంది. దీనితో పాటు 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో కూడిన మిక్స్‌డ్-ఫీడ్ ఇథిలీన్ క్రాకర్, సంబంధిత డౌన్‌స్ట్రీమ్ పెట్రోకెమికల్ యూనిట్లను ఏర్పాటు చేస్తారు. మొత్తంగా ఈ కాంప్లెక్స్ ఉత్పాదన వార్షికంగా 10.5 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండగా, పెట్రోకెమికల్ ఇంటెన్సిటీ సుమారు 34 శాతంగా నమోదవుతుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన నిధులను ఈక్విటీ, రుణాల మిశ్రమం ద్వారా సమీకరించనున్నారు. ఈ అనుబంధ సంస్థలోకి విడతల వారీగా గరిష్ఠంగా రూ.44,330 కోట్ల వరకు ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు బీపీసీఎల్ బోర్డు ఇప్పటికే సూత్రప్రాయ అనుమతి ఇచ్చింది. ఇందులో గతంలో ఆమోదించిన రూ.4,900 కోట్ల భాగస్వామ్యం కూడా కలిసి ఉంది. షెడ్యూల్ ప్రకారం, ఈ మెగా రిఫైనరీ ప్రాజెక్ట్ 2032 జూలై నాటికి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించే లక్ష్యంతో పని చేస్తోంది. ప్రస్తుతం బీపీసీఎల్ వార్షిక రిఫైనింగ్ సామర్థ్యం 35.3 ఎంఎంటీపీఏగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ తన సామర్థ్యాన్ని మించి 116.6 శాతం వినియోగంతో నడిచింది. దేశీయంగా పెరుగుతున్న రవాణా ఇంధనాల కొరతను అధిగమించడంతో పాటు, పెట్రోకెమికల్స్ రంగంలో పెరుగుతున్న డిమాండ్-సరఫరా అంతరాన్ని భర్తీ చేయడంలో ఈ కొత్త ప్రాజెక్ట్ ఎంతో దోహదపడుతుంది. ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం ద్వారా ఏపీ పారిశ్రామిక ముఖచిత్రం గణనీయంగా మారే అవకాశం ఉంది.

పిఠాపురంలో అగ్నిప్రమాదం.. పవన్ కల్యాణ్ విచారం

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనలో ఓ పాడి రైతుకి చెందిన పశువులు, కోళ్లు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి గల కారణాలను కాకినాడ జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ధర్మారావుకు చెందిన తాటాకుల పాకలో అగ్నిప్రమాదం సంభవించగా, 7 గేదెలు, 6 దూడలు, సుమారు 30 కోళ్లు మృతి చెందినట్లు తెలిసిందని అన్నారు. తాటాకుల పాకకు నిప్పు అంటుకోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పవన్ కల్యాణ్ చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నారని అన్నారు. ఈ ఘటనలో పాడి రైతు తన జీవనాధారాన్ని కోల్పోవడం



బాధ కలిగించిందని చెప్పుకొచ్చారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై తక్షణమే విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు. ఏపీ ప్రభుత్వం తరఫున బాధిత పాడి రైతుకు అండగా నిలిచేలా, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

హరిహరనాథ్ ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కల్యాణ్

కృష్ణా జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న యడ్లపల్లి హరిహరనాథ్ గుండెపోటుతో మృతిచెందారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. గత నెల రోజులుగా ఎన్నికల విధుల్లో నిమగ్నమైన ఆయన, మరో పదేళ్ల సర్వీసు మిగిలి ఉండగానే అకాల మరణం చెందడం దురదృష్టకరమని అన్నారు. 1999లో బంటుమిల్లి ఎంపీడీఓగా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించిన హరిహరనాథ్ 27 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్ల అమలును ఏ పార్టీ కూడా అడ్డుకోలేదు

మొదటి పేజీ తరువాయి

మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. నారీ శక్తికి భాగస్వామ్యం కల్పించే పోరాటం దశాబ్దాలుగా సాగుతోంది. ఏళ్ల తరబడి దీనికోసం కృషి చేసిన వారిలో నేను కూడా ఒకడిని. ఎందరో మహిళలు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకొస్తూనే ఉన్నారు. ఎందరో అక్కాచెల్లెళ్లు లేఖల ద్వారా అన్ని విషయాలు నాకు తెలిపారు. దేశంలోని వందకు వంద శాతం నారీ శక్తి ఆశీర్వాదం మాతో ఉందని నాకు తెలుసు. దేశంలోని ప్రతి మహిళకు నేను భరోసా ఇస్తున్నాను. మహిళా రిజర్వేషన్ల మార్గంలో ఎదురయ్యే ప్రతి అడ్డంకిని మేము కచ్చితంగా తొలగించి తీరుతాము. అడ్డు తొలగిస్తాము. మా ధైర్యం అజేయమైనది. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న పార్టీలు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో దేశ నారీ భాగస్వామ్యాన్ని పెంచకుండా ఎప్పటికీ ఆపలేవు.

డీలిమిటేషన్ రెండో బిల్లును పరిశీలించాలని లోక్‌సభకు రాష్ట్రపతి సిఫార్సు

ఇదిలా ఉండగా, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన డీలిమిటేషన్ రెండో బిల్లును పరిశీలించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లోక్‌సభకు సిఫార్సు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 117(3) ప్రకారం రాష్ట్రపతి ఈ సిఫార్సు చేశారు. ఈ మేరకు లోక్‌సభ ఓ బులెటిన్ జారీ చేసింది. ఈనెల 30నుంచి ప్రారంభం కానున్న లోక్‌సభ సమావేశాల్లో ప్రభుత్వం డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టనుంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఈ బిల్లును ప్రతిపాదించనుంది. డిసెంబర్ 2న ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టే అవకాశముంది.

సభ సజావుగా సాగేందుకు ఎంపీలంతా సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి

మరోవైపు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసినట్లు పార్లమెంటు వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ప్రత్యేక సమావేశాల విషయంలో ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించిందన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. సభను సమావేశపరచడం రాజ్యాంగ విరుద్ధం ఎలా అవుతుందని ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాలను ప్రోరోగ్ చేయకుండానే సభను మళ్లీ నిర్వహించిన సందర్భాలు గతంలోనూ ఉన్నాయని కిరణ్ రిజిజు గుర్తుచేశారు. ఆగస్టు 13న నిరవధికంగా వాయిదాపడిన వర్షాకాల సమావేశాలను ఇంకా ప్రోరోగ్ చేయనందున, 4 రోజుల భేటీ దానికి కొనసాగింపుగానే జరుగుతుందని ఆయన వివరించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక



సమావేశాల్లో చాలా ముఖ్యమైన బిల్లులు చర్చకు రానున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. సభ సజావుగా సాగేందుకు ఎంపీలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీల నేతలతో తాను ఇప్పటికే మాట్లాడినట్లు కేంద్రమంత్రి చెప్పారు. ప్రభుత్వంతో ఏకీభవించేందుకు లేదా విభేదించేందుకు సభ్యులకు పూర్తి హక్కు స్వేచ్ఛ ఉన్నాయని తెలిపారు. నిబంధనలు, సంప్రదాయాలకు లోబడి ఎంపీలు తమ అభిప్రాయాలను వ్యక్తంచేయాలని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సూచించారు. అయితే శీతాకాల పార్లమెంటు సమావేశాలు నిర్వహిస్తారా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయలేదు.

డీలిమిటేషన్‌తో తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 175కు పెరుగుతాయి

మొదటి పేజీ తరువాయి

ఘనంగా నివాళులర్పించారు. అనంతరం టీజీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. జనాభా ఆధారంగా సీట్లు కేటాయిస్తే దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలకు కొంత అన్యాయం జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. కానీ మహిళా రిజర్వేషన్లతోపాటు 543 సీట్లలో 50 శాతం పెంచితే ఎవరికి అన్యాయం జరగదని భావిస్తున్నానని అన్నారు. ఇలా అయితే ఎవరికి నష్టం జరగకుండా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 175కు లోక్‌సభ స్థానాలు 25కు పెరుగుతాయని అంచనా వేస్తున్నామని రాంచందర్ రావు చెప్పారు. గతంలో రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఒప్పుకోలేదని గుర్తు చేశారు. ఇండియా కూటమి నేతలు కూడా అందుకు అడ్డుపడ్డారని వివరించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాత సీట్లు కూడా పెంచే అవకాశం ఉంటుందని అన్నారు. దేశంలో 140 కోట్ల జనాభా ఇప్పుడు ఉందని.. 1991లో 54 కోట్ల జనాభాకు వారు గతంలో 543 సీట్లు కేటాయించారని సోదాహరణంగా



వివరించారు. 2011 సెన్సెస్ అధారంగా సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు. సీట్ల పెంపుతో ఎస్సీ, ఎస్టీలకు సీట్లు పెరుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. వెనుకబడిన తరగతుల వారికి కూడా సీట్లు వస్తాయని చెప్పారు. సీట్లు పెంచడంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ , బీసీలకు సీట్లు వస్తాయని పేర్కొన్నారు. అయితే వారికి అన్యాయం జరగాలని.. వారు ఎంపీలు, ఎమ్మెల్యేలు కావద్దని కుట్రతో డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నారంటూ ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు నిప్పులు చెరిగారు. మూడు వంతుల జనాభా పెరిగితే చట్టసభల్లో సీట్లు పెరగాలా వద్దా? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దేశాన్ని ఏం చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగితే ఒప్పుకునే పరిస్థితి లేదని ప్రతిపక్షాల తీరును ఎండగట్టారు. ఈ పార్లమెంట్ సెషన్స్ లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టం చేశారు. దీని వల్ల అందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ బిల్లులు ఆమోదించడం ద్వారా అసమానతలు తొలగించి అందరిని సమానం చేయాలని టీజీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు. సిస్టమేటిక్‌గా ఓట్లు డివైడ్ చేయాలనే ఈ డీలిమిటేషన్ బిల్లు అని వివరించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కొంత మందికి లబ్ధి చేకూర్చేలా నియోజకవర్గ విభజన చేసిందని ఆరోపించారు. పార్లమెంట్ ప్రత్యేక సెషన్స్‌లో ప్రవేశపెట్ట బోయే డీలిమిటేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు తెలిపారు.

ఇది ప్రజాస్వామ్యాన్ని అంతమొందించే కుట్ర'

బిల్లును వ్యతిరేకించాలని ఇండీ కూటమి నిర్ణయం

ఓటర్ల జాబితా నుంచి 10 కోట్ల మందికి పైగా పేర్లను తొలగించిన ఎన్నికల సంఘానికి పునర్విభజన బాధ్యతలు అప్పగించడం ఆమోదయోగ్యం కాదని ఖర్గే అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపడిన మహిళా రిజర్వేషన్- రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ఉమ్మడిగా వ్యతిరేకించాలని ఇండీ కూటమి నేతలు నిర్ణయించారు. దిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో రెండు గంటల పాటు జరిగిన విపక్ష నేతల భేటీలో రాహుల్ గాంధీ, అభిషేక్ బెనర్జీ, కపిల్ సిబల్, మనోజ్ ఝా సహా పలువురు విపక్ష నేతలు పాల్గొన్నారు. డీఎంకే, ఆప్, బీజేడీ వంటి పార్టీలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి. భేటీ అనంతరం మాట్లాడిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, మల్లికార్జున ఖర్గే దీఙీూపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నియోజకవర్గాల పునర్విభజన, రాజ్యాంగ సవరణ బిల్లు ప్రజాస్వామ్యాన్ని అంతమొందించే కుట్ర అని ఖర్గే అన్నారు. ఓటర్ల జాబితా నుంచి 10

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ తెలుగు దినపత్రిక
BHARAT REPORTER లవిపోర్టర్

నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ లా మరియు ఆర్డర్ ఇన్ స్పెక్షన్ చేపట్టిన నగర పోలీసు కమీషనర్. డా.శంఖబ్రత బాగ్చి ఐ.పి.ఎస్. ఏసీపీ లక్ష్మణ్ మూర్తి.





విశాఖపట్నం నవంబర్-28(భారత్ రిపోర్టర్) జిల్లా ఇంచార్జ్.: విశాఖ నగర నగరంలో లా మరియు ఆర్డర్ అదుపులో ఉంచుతూ నగరం మొత్తం ప్రశాంతముగా ఉండేలా అన్ని పోలీస్ స్టేషన్ల నందు కొనసాగుతున్న మూడవ విడత ఇన్ స్పెక్షన్ లో భాగంగా నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ ను సందర్శించిన సిపి మరియు ఏసీపీ లక్ష్మణ్ మూర్తి, తో కలిపి అధికారులు, సిబ్బంది విధులను సమీక్షించి, స్టేషన్ పరిసరాలు మొత్తం పరిశీలించి పలు అదేశాలు జారీచేసారు, స్టేషన్ పరిధిలో గల సమస్యల పై చర్చించి, పరిష్కారానికి తగు చర్యలను సూచించారు, ఎల్లవేళలా స్టేషన్ పరిశుభ్రముగా ఉంచాలని తెలిపిన సీపీ, సిబ్బంది సమస్యలపై, అవసరమైన సదుపాయాలపై వారిని నేరుగా అడిగి తెలుసుకున్నారు, స్టేషన్ రికార్డులు అన్నీ సక్రమముగా ఉన్నదీ లేనిదీ పరిశీలించి స్టేషన్ సంబంధిత అధికారులు సీఐ. రాజేష్, ఎస్సై ప్రసాద్ మరియు 4 టౌన్ సిబ్బందికి తగు ఆదేశాలను జారీ చేశారు.

సిద్దిపేట జిల్లా యువజన సర్వీసుల క్రీడా అధికారిగా చౌటపల్లి బేత వీరారెడ్డి



మఠంపల్లి, సూర్యాపేట, జిల్లా, (భారత్ రిపోర్టర్): మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామంలో బేత నర్సిరెడ్డి లక్ష్మమ్మ దంపతుల పెద్ద కుమారుడు వీరారెడ్డి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా డి వై ఎస్ ఓ గా విధులు నిర్వహిస్తున్నారు. వీరారెడ్డి ఉన్నత విద్య మఠంపల్లి వి.వి ఉన్నత పాఠశాల నందు విద్యసభ్యసించి 1996 - 97 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న తర్వాత, ఒక వాలీబాల్ క్రీడాకారుడుగా ఎన్నో అవార్డులు పొంది, అదే వాలీబాల్ నందుతెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ (ఎస్ ఎ టి జి)వాలీబాల్ కోచ్గా బాధ్యతలు నిర్వహిస్తూ, ఉన్న క్రమంలో పదోన్నతి ద్వారా సిద్ధిపేట జిల్లా డివైఎస్ఓ గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ నెలలో మన రాష్ట్రంలో నిర్వహిస్తున్న కే లో ఇండియా యూత్ గేమ్స్ (కే ఎల్ వై జి)వాలీబాల్ బాలుర జట్టుకు ప్రధాన కోచ్ గా ఇటీవల నియమితులయ్యారు. ఇతని నియామకం పట్ల ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ క్రీడాకారులు, మరియు వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు, స్నేహితులు, గ్రామస్తులు, హర్షం వ్యక్తం చేశారు

డిసెంబర్ 04 వ తేదీన నేవీ డే సందర్భంగా నేవీ ఉన్నతాధికారులు మరియు పోలీసు ఉన్నతాధికారుల తో సమావేశం నిర్వహించిన. నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్.





విశాఖపట్నం నవంబర్ - 28(భారత్ రిపోర్టర్) జిల్లా ఇంచార్జ్.: డిసెంబర్ 04 వ తేదీన బీచ్ రోడ్ నందు నిర్వహించు నావికాదళ దినోత్సవం నేవీ డే సందర్భంగా పలువురు నేవీ ఉన్నతాధికారులు మరియు పోలీసు ఉన్నతాధికారులతో కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేవీ డే సందర్భంగా నగరానికి విచ్చేయు పలువురు వి.వి.ఐ.పి ల భద్రతా ఏర్పాట్లు , క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నిర్వాహణ, సభ ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, వి.ఐ.పి కాన్వాయ్ లు , వాటిని నిలిపే ప్రాంతాలు, ఆధునిక నిఘా వ్యవస్థ ఏర్పాట్లు, తదితర అంశాలు చర్చించడమైనది. నావికాదళ దినోత్సవం నేవీ డే ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలను సమన్వయపరచుకుంటూ నిర్వహించడానికి కావలసిన చర్యలపై చర్చించిన పోలీసు కమిషనర్ పలు అదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సి.పి తో పాటుగా, నేవీ ఉన్నతాధికారులు, డి.సి.పి-01, డి.సి.పి-02, డి.సి.పి క్రైమ్స్, డి.సి.పి అడ్మిన్, నగర ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మాటకు విలువనిస్తూ, ఆ కుటుంబానికి అండగా నిలిచిన కేఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కళ్యాణ్ రావు.



చిన్నంబావి నవంబర్ 28 భారత్ న్యూస్: బెక్కెం గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా నీరుకట్టి చిన్నముగి నరసింహ దశదిన కార్యక్రమానికి మాట ఇచ్చి నిలబెట్టుకున్న కేఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కొత్త కళ్యాణ్ రావు, ఆరోజు ఆ కుటుంబానికి ఇచ్చిన మాటను ఆలస్యమైనా మరచిపోకుండా, ఈరోజు స్వయంగా స్పందించి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయం. ఆపదలో ఉన్న కుటుంబానికి సమయానికి అండగా నిలవడం,కష్టకాలంలో వారికి భరోసా కల్పించడం ఎంతో విలువైన విషయం. ఇచ్చిన మాటను గుర్తుంచుకుని, ఆ కుటుంబానికి అండగా నిలిచి తన బాధ్యతను నెరవేర్చినందుకు కొత్త కళ్యాణ్ రామ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము.ఆర్థిక సహాయం అనేది కేవలం డబ్బు రూపంలో చేసే సాయం మాత్రమే కాదు; కష్టాల్లో ఉన్న కుటుంబానికి ధైర్యాన్ని, నమ్మకాన్ని, మనోధైర్యాన్ని అందించే గొప్ప తోడ్పాటు.ఈ సహాయాన్ని అందించిన కొత్త కళ్యాణ్ రామ్ కి ఆ కుటుంబ సభ్యుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా మరెన్నో నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.ఈ సహాయాన్ని తూర్పింటి కురుమూర్తి, ఉమేష్ నాయుడు,హోటల్ రాముడు, బండారు కురుమూర్తి,చిన్న పుల్లయ్య , డీఎన్ రాంబాబు , ఆది నారాయణ, బిచ్చన్న సాగర్, శేఖర్, ఆర్.ఎం.పి కురుమూర్తి పాల్గొనారు.

డిసెంబర్ 13న వైజాగ్ నేవీ మారథాన్. కలెక్టర్ అభిషిక్త్ కిషోర్,జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, డీసీపీ చందోలు మణికంఠ.కమాండర్ ఎస్ఎస్ దోడి, టి రవికుమార్,రిటైర్డ్ ఇంచార్జ్ లెఫ్టినెంట్ కమాండర్ రోషన్ సాహూ.

విశాఖపట్నం డిసెంబర్-28: డిసెంబర్ 4న జరిగే నేవీ డే-2026, నావెల్ ఆపరేషన్ డెమోనిస్ట్రేషన్ డిసెంబర్ 13న జరిగే వైజాగ్ నేవీ మారథాన్ లను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నేవల్ అధికారులు ,జిల్లా అధికారులతో నేవీ డే, విశాఖ నేవి మారథాన్ నిర్వహణ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 3వ తేదీన ఆర్కే బీచ్ లో ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ జరుగుతాయని ,4వ తేదీన నేవెల్ ఆపరేషన్ డెమోనిస్ట్రేషన్ జరుగుతుందని అందుకు కనుగుణంగా అధికారులకు జిల్లా అధికారులు తమ పూర్తి సహకారం అందించి విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. నావెల్ డే సందర్భంగా విన్యాసాలు జరుగుతాయి కనుక అవి చూడటానికి వచ్చేఅతిధులకు ,ప్రేక్షకులకు ఎ లాంటి సౌకర్యం కలగకుండా బారికేడింగ్, పార్కింగ్,విద్యుత్ సరఫరా, టాయిలెట్స్ ఏర్పాటు కు సహకరించాలని , ముఖ్యంగా పోలీస్ శాఖ తమ సహకారం అందించాలని నోడ్రోన్ ఫ్లై ఏరియా గా పరిగణించాలని నేవీ అధికారులు కలెక్టర్ ను కోరారు. డిసెంబర్ 13న వైజాగ్ నేవీ మారథాన్ 2026 విశాఖపట్నం లో జరుగుతుందని సుమారు 15 వేల మంది పైగా పాల్గొనే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ మారథాన్ లలో తూర్పు నౌకాదళ నేపథ్యంలో 4 కేటగిరీలలో మారథాన్ లు నిర్వహిస్తారని తెలిపారు. 42 కి.మీ. ఎయిర్ క్రాఫ్ట్ రన్,

డిసెంబర్ 4 నేవీ డే



21 కి.మీ.సబ్ మెరైన్ రన్, పది కిలోమీటర్ల ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ రన్, ఐదు కిలోమీటర్ల ఫ్రిగేట్ రన్, విభాగాలు ఉంటాయన్నారు. అన్ని విభాగాల రన్ లు ఆర్కే బీచ్ నుండి ప్రారంభమై విశాఖపట్నం తీర ప్రాంతం మీదుగా భీముని పట్నంలోని ఐ ఎన్ ఎస్ కళింగ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మారథాన్ ఫిజికల్ ఫిట్నెస్ పెంచుతుందని,తీరప్రాంతం మీద అవగాహన పెంచుతుందని,నేవీ అధికారులు తెలిపారు.మారథాన్ విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరారు.

వివరాల కొరకు WWW.vizagnavymarathon.run 7386007503,9515448412 , Kalingavizag navy-marathon@ gmail.com ను సంప్రదించాలని నేవీ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, డీసీపీ చందోలు మణికంఠ, డిఆర్ఓ ఎస్ డి అనిత, రేస్ ఆర్గనైజర్ కమాండర్ ఎస్ఎస్ దోడి, రేస్ కన్సల్టెంట్ టి రవికుమార్, (రిటైర్డ్)ఆఫీసరు ఇంచార్జ్ లెఫ్టినెంట్ కమాండర్ రోషన్ సాహూ, పలువురు జిల్లా అధికారులు, నేవీ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే గారి వర్ధంతి ఘన నివాళి

జిల్లా అధ్యక్షులు కె.కె రాజు, బీసీ సెల్ సనపల రవీంద్ర భరత్.



విశాఖపట్నం నవంబర్-28(భారత్ రిపోర్టర్) జిల్లా ఇంచార్జ్.: విశాఖపట్నం జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.. ఈసందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలోని అణగారిన, అణచివేయబడిన వర్గాల అభ్యున్నతికి విద్య ఒక్కటే ప్రధాన మార్గమని చాటి చెప్పారు. సమాజంలో సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించాలంటే ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలని, ముఖ్యంగా మహిళలకు విద్య ఎంతో అవసరమని ఆయన బలంగా నమ్మారు. మహిళలు ఇంటి గడప దాటి విద్యను అభ్యసించేలా తన సతీమణి సావిత్రిబాయి పూలే తో కలిసి ఎన్నో అవమానాలను, అడ్డంకులను ఎదుర్కొంటూ పోరాటం చేశారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం వారు చేసిన కృషి చిరస్మరణీయం.మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎంతోమంది ప్రధానులు, ముఖ్యమంత్రులు పాలించినప్పటికీ, వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా సముచిత ప్రాధాన్యత కల్పించే దిశగా సమగ్రంగా అమలు చేసిన సంస్కరణలు చాలా పరిమితంగానే ఉన్నాయి. అయితే 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు. నామినేటెడ్ పదవుల నుంచి దేవాలయ కమిటీల వరకు, స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర క్యాబినెట్ వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు 50 శాతానికి పైగా ప్రాతినిధ్యం కల్పించే దిశగా అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. ఈ సంస్కరణల ద్వారా వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా సముచిత గుర్తింపు, ప్రాధాన్యత కల్పించిన ఘనత శ్రీ వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుంది. మహాత్మా జ్యోతిరావు పూలే కలలుగన్న సమాజ నిర్మాణానికి విద్య, విజ్ఞానం, సామాజిక సమానత్వం ఎంతో అవసరం. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ గౌరవం, సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. అయితే నేడు ప్రస్తుత ప్రభుత్వం సామాజిక న్యాయానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆటంకం కలిగించే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల పక్షాన నిలబడి, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్ష పార్టీగా నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వంటి మహనీయుల ఆశయాలు, ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తిగా నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున మహాత్మా జ్యోతిరావు పూలే కి ఘన నివాళులర్పిస్తున్నామని అన్నారు. సమన్వయ కర్తలు తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి , మొల్లి అప్పారావు , మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, సి.ఇ.సి సభ్యులు కోలా గురువులు, నియోజకవర్గ పరిశీలకులు సి.ఎం.ఎ. జహీర్ అహ్మద్, పేడాడ రమణి కుమారి, పిన్నమరాజు సతీష్ వర్మ, మాజీ డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, కార్పొరేటర్లు పోతిన హనుమంతు, అల్లు సత్యశ్రీ, జాహిరున్నిష, దాసరి అన్నపూర్ణ, దర్మాల రాధిక శ్రీను సోమాదుల సురేష్, సీనియర్ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, గుంటూరు నరసింహ మూర్తి, మంచా నాగమల్లేశ్వరి, కిరణ్ రాజు, బొల్లవరపు జాన్ వెస్లీ, కె.అనిల్ కుమార్ రాజు, జీలకర్ర నాగేంద్ర, ద్రోణంరాజు శ్రీవాస్తవ, సేనాపతి అప్పారావు, అంబటి నాగ వినాయక సైలేష్, బర్మత్ అలీ, బోని శివ రామకృష్ణ, వాసుపల్లి యల్లాజీ, వంకాయల మారుతి ప్రసాద్, వడ్డాది దిలీప్ కుమార్, సకలభక్తుల ప్రసాదరావు, దేవరకొండ మార్కండేయులు, నీలి రవి, పమేటి బాబ్జి, పైడి శ్రీను, బిపిఎన్ కుమార్ జైన్, దయమతి, విశాల లక్ష్మి, బొడ్డేటి కిరణ్, ఈశ్వరరావు, గోవింద్, సూరిబాబు, పత్తి వెంకటలక్ష్మి, కోదూరు సుశీల, రాయుడు శ్రీను, తుళ్ళి చంద్ర శేఖర్ , శ్రీనివాస రెడ్డి , వాసు, కృష్ణ, వెంకట రావు, బోని అప్పారావు, రాజు బాలి, సతీష్, దేవా కుమార్, సత్యాల వెంకట, కృష్ణ, కె.సుకుమార్, హరికృష్ణ, బోగవల్లి గోవింద్, జక్కంపూడి సత్యనారాయణ, హబీబ్, జానకి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంట్ల శ్రీనుబాబు,గంట్ల హర్షవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప నామస్మరణ

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేకాలు, భజనలు. ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు.



విశాఖపట్నం నవంబర్-28(భారత్ రిపోర్టర్) జిల్లా ఇంచార్జ్.: సింహాద్రి అప్పన్న పరమ భక్తుడు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, డాక్యార్డ్ కేటీబీ అసోసియేషన్ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు నివాసంలో శనివారం అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలు, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ జరిగిన ఈ వేడుకలో అయ్యప్ప నామస్మరణ, శరణుఘోషతో పరిసర ప్రాంతం మార్మోగింది. తొలుత గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం మహాలక్ష్మి పూజలు నిర్వహించారు. తదుపరి వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, శీతల ద్రవ్యాలతో అయ్యప్ప స్వామికి విశేష అభిషేకం జరిపించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ చేసిన వందలాది మంది భక్తులు శరణుఘోషతో పాటు భక్తి గీతాలు, భజనలతో స్వామివారిని కీర్తిస్తూ ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయారు. ఈ పూజా కార్యక్రమానికి మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. గురుస్వామి గణేష్ తొలుత గంటా శ్రీనివాసరావు తో పాటు భక్తులందరి గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతి సమర్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. గంటా శ్రీనివాసరావు అయ్యప్ప స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తితో నమస్కరించుకున్నారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ. లోకమంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని అయ్యప్ప స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. అయ్యప్ప మాలధారణ చేసి నిష్ఠతో నియమాలు పాటిస్తూ స్వామివారి సేవలో తరించే వారు ఎంతో అదృష్టవంతులని కొనియాడారు. అనంతరం గంట్ల శ్రీనుబాబు, ఆయన సతీమణి సత్యవతి దంపతులు కుమార్తె హనీషా



..కుమారుడు హర్షవర్ధన్ స్వామి లు గంటా శ్రీనివాసరావు ను శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. పూజా కార్యక్రమానికి విచ్చేసిన అయ్యప్ప మాలధారణ భక్తులు, ఇతర అతిథులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రత్యేకంగా నిర్వహించిన పంచామృతాభిషే క ప్రసాదాన్ని భక్తులందరికీ అందజేశారు. భక్తుల సమక్షంలో జరిగిన ఈ వేడుక ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

విద్యార్థుల సమస్యలు వసతులపై క్షేత్రస్థాయిలో పరిశీలన

విద్యార్థులు చదువుపై దృష్టి సారించి తమకు నచ్చిన రంగాల్లో ఉన్నతంగా రాణించాలి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మునిపల్లి మండల ప్రత్యేక అధికారి రామాచారి



సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి (భారత్ రిపోర్టర్) 2026 నవంబర్ 28 శనివారం మునిపల్లి మండలం బుదేరాలోని మహిళా డిగ్రీ కళాశాలను శనివారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మునిపల్లి మండల ప్రత్యేక అధికారి రామాచారి సందర్శించి కళాశాలలోని వసతులు భోజన ఏర్పాట్లు పరిసరాల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలోని వంటగది స్టోర్ రూమ్ భోజన తయారీకి వినియోగించే సామగ్రి కళాశాల పరిసరాలను కలియతిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత వంటగది పరిశుభ్రత ఆహార పదార్థాల నిల్వ కళాశాల ఆవరణలో పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజన నాణ్యతపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.



విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు ఎలా సాగుతోంది ఏమైనా సమస్యలు ఉన్నాయా కళాశాలలో అందిస్తున్న భోజనం నాణ్యత ఎలా ఉంది, వసతులు సక్రమంగా ఉన్నాయా తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని అందులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఉద్బోధించారు. విద్యను తమ భవిష్యత్తుకు బలమైన పునాదిగా మలుచుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.



బాలల సంరక్షణ, పునరావాసం, హక్కుల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి, జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి,



విశాఖపట్నం నవంబర్-28 (భారత్ రిపోర్టర్) జిల్లా ఇంచార్జ్.: విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్ జి. విద్యాధరి, ఐఏఎస్. ఆధ్వర్యంలో బాలల సంక్షేమ కమిటీ త్రైమాసిక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన సంరక్షణ మరియు రక్షణ అవసరమైన బాలల కేసులపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ కమిటీ పరిధిలోని కేసుల్లో పిల్లల ప్రస్తుత పరిస్థితి, వారి అవసరాలు, కుటుంబ నేపథ్యం, పునరావాస అవకాశాలు తదితర అంశాలను సమీక్షించారు. సంరక్షణ మరియు రక్షణ అవసరమైన బాలల ఉత్తమ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, వారిని తిరిగి వారి కుటుంబాల్లోకి చేర్చడం రెస్టరేషన్, అవసరమైన సందర్భాల్లో బాలల సంరక్షణ సంస్థల్లో చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ సిసిఐఎస్, తగిన వసతి కల్పించడం ప్లేస్మెంట్ వంటి అంశాలపై చర్చించారు. అలాగే, బాలల పునరావాసం అనంతరం వారి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించడం, వారికి నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలు, భద్రత మరియు ఇతర ప్రాథమిక అవసరాలు అందేలా చూడటం, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయడం వంటి అంశాలపై సమీక్షించారు. ప్రతి బాలుడికి సురక్షితమైన వాతావరణం, తగిన సంరక్షణ, రక్షణ మరియు మెరుగైన భవిష్యత్తు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ, సాధికారత అధికారి శ్రీమతి సి.హెచ్. సంతోషి కుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరికృష్ణ, బాలల సంక్షేమ కమిటీ చైర్పర్సన్ బి. హరి వెంకట రమణ, కమిటీ సభ్యులు మరియు జిల్లా బాలల సంరక్షణ విభాగానికి చెందిన ప్రొటెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

డోర్నాలలో మూడో విడత ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న..

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ జగదీశ్వరి



పోలవరం, నవంబర్ 28 (భారత్ రిపోర్టర్): ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని డోర్నాల గ్రామంలో మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ శ్రీమతి కొవ్వాసు జగదీశ్వరి పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంటుండగా, డోర్నాలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో జగదీశ్వరి పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాన్ని కొనసాగించారు.

కుమార్తె పుట్టినరోజు వేడుకను సేవా కార్యక్రమంగా
మార్చిన హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్
64 మంది యువకులకు హెల్మెట్ల పంపిణీ..
రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం



పోలవరం, నవంబర్ 28 (భారత్ రిపోర్టర్): ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండల కేంద్రంలో కుమార్తె దీప్తి ఫ్లోరెన్స్ 5వ పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య హంగు ఆర్భాటాలతో కాకుండా ఒక ప్రభుత్వ ఉద్యోగి హెల్త్ అసిస్టెంట్ కూరం ప్రసాద్ జీలుగుమిల్లి పరిసర గ్రామాలకు చెందిన 64 మంది యువకులకు హెల్మెట్స్ కొనుగోలు చేసి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి సీఐ యాదగిరి, ఎస్సై క్రాంతి కుమార్,డాక్టర్ మణికంఠేశ్వర్,పవన్ కుమార్ చేతుల మీదుగా యువకులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో మా స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో కేవలం హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు తీవ్రమైన దెబ్బలు తగిలి చనిపోవడం జరిగింది జీలుగుమిల్లి పరిసర ప్రాంతాల్లో అనేక మంది రోడ్డు ప్రమాదాలు జరిగి తలకు తీవ్రమైన గాయాలపాలై చనిపోయిన పరిస్థితులను చూసి ఈ యొక్క ఆలోచన రావడం పోలీస్ అధికారులను సంప్రదించి వారి ఆధ్వర్యంలో యువతకు రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించడం ఒక మంచి సందేశాన్ని స్ఫూర్తిని కలిగించాలని ఈ కార్యక్రమం చేయడం జరిగింది . దీనికి సహకరించిన సీఐకి, ఎస్సైకి డాక్టర్ కి, కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.



కైలాసగిరిపై స్కూలు బస్సు ప్రమాదం బాధాకరం
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలి.
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు.



విశాఖపట్నం నవంబర్-28 (భారత్ రిపోర్టర్) జిల్లా ఇంచార్జ్.: కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆదర్శ ఇంగ్లీష్ మీడియం స్కూలుకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు విహారయాత్రలో భాగంగా విశాఖపట్నంలోని కైలాసగిరికి రాగా, శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3.15 గంటల సమయంలో కొండపై నుంచి ఘాట్ రోడ్డులో కిందకు వస్తుండగా బస్సు బ్రేకులు విఫలమై ప్రమాదం చోటుచేసుకుందని , ప్రమాద సమయంలో బస్సులో సుమారు 37 మంది ఉండగా, ఒక ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థులు గాయపడిన ఘటనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు తీవ్ర విచారణ వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులను విహారయాత్రలకు తీసుకెళ్లే సమయంలో బస్సుల కండిషన్, బ్రేకులు, ఇతర సాంకేతిక అంశాలను ముందుగానే క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని పేర్కొన్నారు. రవాణా శాఖ, విద్యాశాఖ, పర్యాటక శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాల బస్సులపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రమాదంలో గాయపడిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు మెరుగైన వైద్యం అందించాలని, వారు త్వరగా కోలుకోవాలని కె.కె. రాజు ఆకాంక్షించారు.

బూదరాళ్ల పంచాయతీలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి
కొర్రా తిరుపతి ఘన విజయం
ప్రజల ఆదరణకు కృతజ్ఞతలు తెలిపిన కొర్రా తిరుపతి



కొయ్యూరు భారత్ న్యూస్ : అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం బూదరాళ్ల గ్రామ పంచాయతీలో నిర్వహించిన స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొర్రా తిరుపతి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, విజయానికి తోడ్పాటు అందించిన బూదరాళ్ల పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ విజయం తన ఒక్కడిదే కాదని, తనపై విశ్వాసం ఉంచిన ప్రతి ఒక్కరి విజయమని పేర్కొన్నారు. ప్రజలు తనకు అప్పగించిన బాధ్యతను గౌరవిస్తూ పంచాయతీ అభివృద్ధికి, గ్రామాల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోనంగి కండ్రమ్మతో పాటు వార్డు సభ్యులు పండ్ర పరమేశ్వరరావు, వంతల కాంతమ్మ, పాంగి జ్యోతి, వంతల జ్యోతి, మర్రి బాలరాజు, జెర్సింగి చంద్రమ్మ, బోనంగి సత్తిబాబు, వంతల మాధవరావు, కొర్ర సూరిబాబు, మర్రి రంగారావు, గేమ్మెలి కామేశ్వరరావు, పాంగి సన్యాసిరావు, పాంగి ప్రసాదు, తాంబేలు నాగేశ్వరరావు, కొర్ర రామన్న, గేమ్మెల మనోజ్ కుమార్, మర్రి భీమరాజు, సిందేరి లక్ష్మణరావు, సిందేరి రామారావు, కొర్రా సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీకి ఘన సన్మానం



కొయ్యూరు భారత్ న్యూస్: అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చిట్టింపాడు గ్రామంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ప్రజా సంకల్ప వేదిక అల్లూరి జిల్లా ఇన్‌చార్జి ఉల్లి తలుపుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిట్టింపాడు గ్రామ సర్పంచ్ పల్లి వరలక్ష్మి, పెదగదబపాలెం సర్పంచ్ పోటుకూరి నూకరాజు, డొనూరు సర్పంచ్ దొండా జ్యోతిప్రసాద్, డొనూరు ఎంపీటీసీ ఉల్లి బాలతల్లిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని గ్రామాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఇన్‌చార్జి ఉల్లి తలుపులు, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు గుమ్మ అప్పన్నబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు తిరువాడి రమణబాబు, జిల్లా ప్రజా చైతన్య విభాగం అధ్యక్షుడు పోటుకూరి రాంబాబు, ప్రజా చైతన్య విభాగం ఉపాధ్యక్షుడు కయ్యం నాగేశ్వరరావు, జిల్లా అవినీతి నిరోధక విభాగం కార్యనిర్వాహక అధ్యక్షుడు పల్లి ధారబాబు, కొయ్యూరు మండల సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు ధవళ సింహాచలం, ఉపాధ్యక్షుడు వార కొండలరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాలల భద్రత హక్కుల పరిరక్షణపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

సురక్షిత్ బచ్పన్ అభియాన్ ఫేజ్-IIలో భాగంగా వర్చువల్ శిక్షణ కార్యక్రమం



సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి (భారత్ రిపోర్టర్) 2026 నవంబర్ 28 శనివారం బాలల భద్రత హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి అదే విధంగా సెషన్స్ జడ్జి జి. భవాని చంద్ర అన్నారు. బాలలపై జరిగే హింస వేధింపులు దోపిడీ బాల్యవివాహాలు బాల కార్మిక వ్యవస్థ వంటి సమస్యలను నివారించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. సురక్షిత బాల్య అభియాన్ సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు సముదాయంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి నామినేట్ చేయబడిన ఉపాధ్యాయులకు ప్రత్యేక వర్చువల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర హాజరై మాట్లాడుతూ బాలల రక్షణ కుటుంబాలకే పరిమితమైన బాధ్యత కాదని సమాజంలోని ప్రతి ఒక్కరూ బాలల భద్రతకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు గమనిస్తూ వారి సమస్యలను సున్నితంగా అర్థం చేసుకుని అవసరమైన సహాయం అందించాలని అన్నారు. విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా పంచుకునేలా సురక్షితమైన సమ్మకమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ శిక్షణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య III అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ డీసీఆర్బీ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. రమేష్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి రత్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ అడ్వకేట్ లక్ష్మి పాల్గొని బాలల పరిరక్షణకు సంబంధించిన వివిధ చట్టాలు అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో బాలల హక్కులు పోక్సో చట్టం బాల్యవివాహాల నిషేధ చట్టం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన బాలల అక్రమ రవాణా నివారణ సైబర్ నేరాలు ఆన్‌లైన్ వేధింపులు బాలల మానసిక ఆరోగ్యం బాలల ఫిర్యాదుల పరిష్కార విధానాలపై వివరించారు. బాలలపై జరిగే నేరాలను గుర్తించడం బాధిత బాలలకు చట్టపరమైన రక్షణ కల్పించడం వారి వివరాలను గోప్యంగా ఉంచడం అవసరమైన సందర్భాల్లో పోలీస్ శాఖ డీసీపియు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తదితర సంబంధిత అధికారులకు తక్షణ సమాచారం అందించడం వంటి అంశాలపై ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు. బాలల హక్కులు భద్రతపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి పాఠశాల స్థాయిలో బాలలపై జరిగే నేరాలను ముందుగానే గుర్తించి నివారించడం బాలలకు భయరహిత సురక్షితమైన బాల్యాన్ని అందించడమే సురక్షిత బాల్య అభియాన్ ఫేజ్-II శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.



సురక్షిత్ బచాపాన్ అభియాన్ ఫేజ్-II కార్యక్రమంలో భాగంగా

సంగారెడ్డి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఇంటికి మాజీ మంత్రి హరీష్ రావు
నూతన వధువరులను ఆశీర్వదించిన బి ఆర్ ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావు...



సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి (భారత్ రిపోర్టర్) 2026 నవంబర్ 28 శనివారం సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఇంటికి హరీష్ రావు రాకతో తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా చర్చ ఆత్మీయత వెనుక రాజకీయ సంకేతాలు ఉన్నాయా రాజకీయంగా ప్రత్యర్థులు వ్యక్తిగతంగా ఆత్మీయులు 21 ఈళ్ల రాజకీయ దూరానికి కుటుంబ వేడుకతో ఫుల్ స్టాప్. వివరాలు ఇలా ఉన్నాయి 21 ఏళ్లుగా టిఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫోర్ లీడర్ మాజీ మంత్రి హరీష్ రావును కలుసుకోలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు.



వీటివల్ల జగ్గారెడ్డి తనయుడు భరత్ సాయి రెడ్డి పలాక్ పటేల్ వివాహం జరిగింది. నూతన దాంపత్యలను ఆశీర్వదించేందుకు హరీష్ రావు శనివారం సంగారెడ్డి జగ్గారెడ్డి నివాసానికి వచ్చారు ఈ సందర్భంగా హరీష్ రావును జగ్గారెడ్డి దాంపత్యలు ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా ఆహ్వానించారు. నూతన దాంపతులను ఆశీర్వదించిన తర్వాత హరీష్ రావు జగ్గారెడ్డిలు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. మీడియా పత్రిక సమక్షంలో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ 2024లో హరీష్ రావు మంత్రిగా ఉన్నప్పుడు ఆయనను కలిసి ఆయన ఛాంబర్ లో భోజనం చేసేవాళ్లం ఆ తర్వాత నేను కాంగ్రెస్ లోకి వచ్చాక మళ్లీ అప్పటి వరకు హరీష్ రావును కలవలేదు. అదేవిధంగా మళ్ళీ 21 ఏళ్ల తర్వాత మొదటిసారి మళ్లీ ఫ్యామిలీ ఫంక్షన్లో కలుసుకున్నాం కూతురు పెళ్లికి హరీష్ రావును వెళ్ళలేకపోయాను కానీ ఈ ఫంక్షన్ మిస్ కావొద్దని ఆహ్వానించాను. మా ఇద్దరి కలయికలో ఎటువంటి రాజకీయాలు లేవు మా కలయికల్లో ఎటువంటి మతలబు లేదు రాజకీయం రాజకీయమే హరీష్ రావు బిఆర్ఎస్ లో అగ్రనేత నేను కాంగ్రెస్ లో టాప్ లీడర్ కాకపోయినా ఒక స్థాయి లీడర్ నే అని జగ్గారెడ్డి అన్నారు. అనేక ఫంక్షన్లకు ఆయనని వెళ్ళలేకపోయాను పదేళ్లు హరీష్ రావు మంత్రిగా ఉన్న సమయంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న ఆయనని కలవలేదు అని ఆయన కొనియాడారు. అదేవిధంగా జగ్గారెడ్డి అవును 21 ఏళ్లు లో జగ్గారెడ్డి ఏనాడు తనను కలుసుకోలేదు అని హరీష్ రావు పేర్కొన్నారు



వీరిద్దరి కలయిక రాష్ట్రంలో చర్చనీయంగామారింది రాజకీయ 21 ఏళ్ల టిఆర్ఎస్ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజీ హరీష్ రావును కలుసుకోలేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. యంగ వద్ద శత్రువులుగా ఉన్న వీరిద్దరి మాట మంత్రి ఎక్కడికి దారి తీస్తుందో అన్న చర్చ జరుగుతుంది అంతకుముందు జగ్గారెడ్డి నివాసంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఏఐసీసీ సెక్రెటరీ కోసుమ్ కుమార్ ఉన్నారు. హరీష్ రావు వెంట ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథం సృజనాత్మకతను వెలికితీసేలా జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 2026

డిసెంబర్ 1 నుంచి 3 వరకు సంగారెడ్డిలో మూడు రోజుల పాటు సైన్స్ ఫెయిర్ నిర్వహణ
విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి



సంగారెడ్డి జిల్లా : ప్రతినిధి (భారత్ రిపోర్టర్) 2026 నవంబర్ 28 శనివారం విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకత నూతన ఆవిష్కరణల ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన-2026 ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని కమిటీలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి సూచించారు. సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంటోనీ శాంతినగర్ పాఠశాలలో డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లపై శనివారం ఆమె 13 కమిటీల కన్వీనర్లు కో-కన్వీనర్లు సభ్యులతో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఫుడ్ కమిటీ బాలికల వసతి కమిటీ స్టేజ్ కమిటీ మీడియా కమిటీలు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనే విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం సురక్షితమైన వసతి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో సెయింట్ ఆంటోనీస్ విద్యాసంస్థల చైర్మన్ సాల్మన్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం తమకు ఎంతో ఆనందంగా గర్వంగా ఉందన్నారు. జిల్లాలోని విద్యార్థుల విద్యా వైజ్ఞానిక ప్రతిభను ప్రోత్సహించేందుకు తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నామని ఈ సంవత్సరం కూడా ప్రదర్శన విజయవంతానికి అవసరమైన అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణను సమర్థవంతంగా చేపట్టేందుకు వివిధ మండల విద్యాధికారులకు కమిటీల వారీగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా సంగారెడ్డి మండల విద్యాధికారి విద్యాసాగర్‌కు స్టేజ్, డిసిప్లిన్ ఫుడ్ కమిటీల బాధ్యతలు అప్పగించారు. కోహీర్ మండల విద్యాధికారి జాకీర్ హుస్సేన్‌కు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా కమిటీ బాధ్యతలు, పుల్కల్ మండల విద్యాధికారికి హెల్త్ అండ్ హైజీన్ ఆర్గనైజింగ్ హెల్ప్ కమిటీల బాధ్యతలు అప్పగించారు. కంది మండల విద్యాధికారి జోగప్పకు రిజిస్ట్రేషన్ డిస్ప్లే కమిటీల బాధ్యతలు రాయికోడ్ మండల విద్యాధికారి నర్సింలుకు స్టేజ్, కల్చరల్ ఇన్విటేషన్ కమిటీల బాధ్యతలు అప్పగించారు. కమిటీలన్నీ తమకు కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డి సి ఈ బి సెక్రటరీ లింబాజీ ఐదు మండలాల విద్యాధికారులు జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, 13 కమిటీల కన్వీనర్లు కో-కన్వీనర్లు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా వీడ్కోలు వేడుకలు



కొయ్యూరు భారత్ న్యూస్: అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థినులకు వీడ్కోలు వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. సుధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమం ఆనందోత్సాహాలు, ఆత్మీయత నిండిన వాతావరణంలో సందడిగా సాగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కె. సుధ మాట్లాడుతూ విద్యార్థినులు కళాశాలలో పొందిన జ్ఞానం, క్రమశిక్షణ, నైతిక విలువలను జీవితంలో ఆచరిస్తూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వై. వెంకటలక్ష్మి, అధ్యాపకులు విద్యార్థినులకు భవిష్యత్తులో మంచి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం విద్యార్థినులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తమ కళాశాల జీవితంలోని మధుర జ్ఞాపకాలను, అనుభవాలను పరస్పరం పంచుకుంటూ సందడి చేశారు. చివరి సంవత్సరం విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి అభివృద్ధే లక్ష్యం ..
సమస్యలకు శాశ్వత పరిష్కారమే ధ్యేయం
కత్తెర గుర్తుకు ఓటు వేయాలని చాందిని ఇర్షాద్ విజ్ఞప్తి



పరిగి, నవంబర్ 28(భారత్ రిపోర్టర్):పరిగి గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని పరిగి పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఎం. చాందిని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను కలుస్తూ, గ్రామ అభివృద్ధిపై తన ప్రణాళికలను వివరిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు, వీధుల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అలాగే పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు, పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించేలా కృషి చేస్తామని ప్రచారంలో హామీ ఇస్తున్నారు. మహిళలు, యువత, వృద్ధులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రతి వార్డులో పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాల సమస్యలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పంచాయతీ పరిధిలోని ప్రతి ప్రాంతానికి సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేస్తానని చాందిని ఇర్షాద్ ప్రజలకు భరోసా ఇచ్చారు. “ప్రజల సమస్యలే నా సమస్యలు.. పరిగి అభివృద్ధే నా లక్ష్యం” అనే నినాదంతో ఆమె ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఎన్నికల్లో తనకు కేటాయించిన స్వస్తిక్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని చాందిని ఇర్షాద్ ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆమెకు మద్దతుగా ఇర్షాద్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు అభ్యర్థులు, అభిమానులు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. డిసెంబర్ 2వ తేదీన ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పోలింగ్‌లో కత్తెర గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని చాందిని విజ్ఞప్తి చేశారు.



Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ తెలుగు దినపత్రిక
BHARAT REPORTER లవాపోర్టర్

పల్లెల ప్రగతే ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యం కావాలి : ప్రత్తిపాటి

30 పంచాయతీల్లో కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్ లుగా విజయం సాధించిన సరికొత్త రాజకీయ చరిత్రకు నాంది : ప్రత్తిపాటి.

మర్యాదపూర్వకంగా తనను కలిసిన నూతన సర్పంచ్ లను పేరుపేరునా అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి.



చిలకలూరిపేట,నవంబర్ 28,(భారత్ న్యూస్)జిల్లా ప్రతినిధి: కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచీ పల్లెల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని, జగన్ పాలనలో సమస్యలు, వర్గ వైషమ్యాలు, నిత్య వివాదాలతో గ్రామాలు పూర్తిగా అభివృద్ధికి దూరమయ్యాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పంచాయతీల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించడంతో గ్రామాల్లో నూతన ప్రగతి అధ్యాయం మొదలు కానుందని ఆయన చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలుపొందిన పలువురు కొత్త సర్పంచ్ లు శనివారం ప్రత్తిపాటిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ విజయం కోసం ఎమ్మెల్యే ప్రత్తిపాటి చేసిన కృషి, ఆయన అందించిన సహాయసహకారాన్నిఎప్పటికీ మరువలేమన్నారు. తనను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సర్పంచ్ లను పేరుపేరునా అభినందించిన ప్రత్తిపాటి, వారికి శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వ ఆలోచనలు, నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయాలని, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, తమను గెలిపించిన పల్లెల అభివృద్ధే ప్రతి ఒక్కరి ప్రధాన లక్ష్యం కావాలని ప్రత్తిపాటి వారికి సూచించారు. నియోజకవర్గంలో మొత్తం 55 సర్పంచ్ స్థానాలుండగా, వాటిలో 30 పంచాయతీల్లో కూటమి పార్టీలు బలపరిచిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవడం సరికొత్త రాజకీయ చరిత్రకు నాంది పలికిందని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు.

గిరిబాబు పెద్ద కర్మ కు హాజరైన ఎమ్మెల్యే



రావినూతల,నవంబర్ 28,(భారత్ న్యూస్): ప్రముఖ సినీ నటులు గిరిబాబు పెద్దకర్మ కార్యక్రమం ప్రకాశం జిల్లా, కోరిశపాడు మండలం, రావినూతల గ్రామంలోని వారి స్వగృహం నందు చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి హాజరయ్యారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి, వారి కుమారుడు, యాక్టర్ రఘుబాబు ని మరియు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రత్తిపాటి వెంట రాజ్యసభ సభ్యులు బాష్యం రామకృష్ణ, మాజీ శాసనసభ్యులు కరణం బలరాం వున్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ..తెలుగు చిత్ర పరిశ్రమ ఒక గొప్ప నటుడిని కోల్పోయిందని, తెలుగు చలనచిత్ర రంగంలో నటుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ప్రముఖ నటులు శ్రీ గిరిబాబు మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు.

ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి...



దేవరకద్ర నవంబర్ 28 భారత్ రిపోర్టర్: దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి అంబేద్కర్ యువజన సంఘం తరఫున పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. అంటరానితనం కుల వ్యవస్థను నిర్మూలించడానికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వెంకట్ నరసింహ, మాజీ మార్కెట్ చైర్మన్ దోబ్బలి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గిద్దే రాములు, కె.జగన్ ఉపాధ్యక్షులు చంద్ర శేఖర్ , మెకానిక్ అంజి, కె.రాజు, గడ్డమీద రాజు,బాలు,ఉస్కీల్ల రాజు,రఘు,శ్రీను మైబు అంజయ్య, తదితరులు పాల్గొన్నారు

పంటల సాగుపై శాస్త్రీయ అవగాహన...

క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు..



దేవరకద్ర నవంబర్ 28 భారత్ రిపోర్టర్ : దేవరకద్ర మండలం గుడిబండ గ్రామంలో వివిధ పంటలను శనివారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులు సాగు చేసిన వేరుశనగ, ఆయిల్‌పామ్, మినుము మరియు కంది పంటల పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పంటల పరిస్థితిని వారు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణి, కోఆర్డినేటర్, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పాలెం శాస్త్రవేత్త దివ్య వల్లపు రైతుల పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా పంటల్లో కలుపు నివారణ, చీడపీడల నియంత్రణ, పంటల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు శాస్త్రీయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే, ఎల్‌నినో ప్రభావంతో రాబోయే యాసంగి సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ పంటల ఎంపికలో ముందస్తు ప్రణాళిక పాటించాలని సూచించారు. తద్వారా రైతులు మంచి దిగుబడులు సాధించి, పంట నష్టాల బారిన పడకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. రాజేంద్ర అగర్వాల్, ఏఈఓ శివ నాయక్ గ్రామ రైతులు పాల్గొన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, శాస్త్రీయ సాగు పద్ధతుల అవలంబన మరియు నీటి వనరుల సమర్థ వినియోగం ద్వారా రైతులు మెరుగైన దిగుబడులు సాధించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని శాస్త్రవేత్తలు వెల్లడించారు.



మందలపు శివకృష్ణ నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న శాసనసభ్యులు: ప్రత్తిపాటి పుల్లారావు



అద్దంకి,నవంబర్-28,(భారత్ న్యూస్): అద్దంకి నియోజకవర్గం శంకరాపురం గ్రామంలో అస్ట్రైర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ చైర్మన్, మ్యాగ్నం వింగ్స్ డైరెక్టర్, సినీ నిర్మాత మందలపు శివకృష్ణ నూతన గృహప్రవేశం సందర్భంగానిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతకల్ప కార్యక్రమానికి మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుహాజరయ్యారు.ఈ సందర్భంగా సినీ హీరో శ్రీకాంత్‌తో కలిసి మందలపు శివకృష్ణకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన గృహంలోసుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

పూలేకు ఘన నివాళులర్పించిన షేక్ నూరి ఫాతిమా



గుంటూరు, నవంబర్ 28,(భారత్ న్యూస్): మహాత్మ జ్యోతిరావు పూలే 136వ వర్ధంతి సందర్భంగా వైసీపీ గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. హిందూ కాలేజ్ సెంటర్ వద్ద ఉన్న పూలే విగ్రహాన్ని స్వయంగా శుభ్రం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశంలో సామాజిక సంస్కరణలకు బలమైన పునాది వేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే : ప్రత్తిపాటి

జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆ మహానీయునికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి.

చిలకలూరిపేట,నవంబరు 28,(భారత్ న్యూస్) జిల్లా ప్రతినిధి: భారతదేశంలో సామాజిక సంస్కరణలకు బలమైన పునాది వేసిన మహాత్మా జ్యోతిరావు పూలే భావజాలం, ఆలోచనలు నేటికీ ప్రజల్ని చైతన్యపరుస్తున్నాయని, ఆయన చూపిన మార్గంలో తరువాత ఎందరో సామాజిక సేవకులు, సంఘ సంస్కర్తలు ప్రజాహితం కోసం తమవంతు సేవలు అందించారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమంలో ప్రత్తిపాటి పాల్గొన్నారు. నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే వర్ధంతి వేడుకకు హాజరైన ప్రత్తిపాటి, ఈ సందర్భంగా ఆ మహానీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



అనంతరం కార్యక్రమానికి హాజరైన వారిని ఉద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు. కులరహిత సమాజం, మహిళా సాధికారత, అందరికీ సమాన విద్య, సామాజిక న్యాయాన్ని మహాత్మా జ్యోతిరావు పూలే తన జీవితాశయాలుగా భావించారని ప్రత్తిపాటి కొనియాడారు. మహిళా విద్య, బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి, రైతు సంక్షేమం, సామాజిక సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, సామాజిక అసమానతలు తగ్గుతాయని భావించిన పూలే, 1848లోనే బాలికల కోసం ప్రత్యేక పాఠశాలను ప్రారంభించారన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాన్ని నిజం చేసేందుకు ఆయన జీవిత భాగస్వామి, సావిత్రి భాయ్ పూలే తీవ్రంగా శ్రమించారని ప్రత్తిపాటి తెలిపారు. భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందిన సావిత్రి భాయ్ పూలే మహిళావిద్య కోసం విశేష కృషి చేశారని ప్రత్తిపాటి ప్రశంసించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త కుమారి, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, షేక్ మస్తాన్ వలి, కొత్త కోటేశ్వరరావు, తన్నీరు పుల్లారావు, తుపాకుల అప్పారావు , బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన అధికారులు...



దేవరకద్ర నవంబర్ 28 భారత్ రిపోర్టర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ స్టేషన్లో భారీగా ప్రత్యేక క్యాంపు నిర్వహించి ఓట్లను నమోదు చేసే కార్యక్రమాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. దేవరకద్ర మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 52, 53 పోలీస్ స్టేషన్లను అధికారులు సందర్శించారు. పట్టభద్రుల ఓట్ల నమోదును పరిశీలించి బిఎల్ఓ లతో మాట్లాడారు. మహబూబ్నగర్ రంగారెడ్డి హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి త్వరలో జరిగే ఎన్నికల కోసం ప్రతి గ్రాడ్యుయేట్ తప్పనిసరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డ్యూటీ ఖలీద్, ఆర్ ఐ శరత్ పెద్దలు పాల్గొన్నారు.

ఎల్ వో సి మంజూరు చేయించిన మంత్రి వాకిటి



ఆత్మకూరు మండల ప్రతినిధి/ నవంబర్28(భారత్ న్యూస్ రిపోర్టర్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని నందిమల్ల క్యాంప్ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ షరీఫ్ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న విషయం తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరికి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన మంత్రి వాకిటి శ్రీహరి, షరీఫ్ వైద్య చికిత్స ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మొదట రూ.5 లక్షల ఎల్ వో సి మంజూరు చేయించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరో రూ.3 లక్షల ఎల్ వో సి మంజూరు చేయించి, మొత్తం రూ.8 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. మంజూరైన ఎల్ వో సి కాపీని ఆర్టీసీ డ్రైవర్ షరీఫ్ కుమారుడికి తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్యశాఖ, క్రీడలు మరియు యువజన శాఖల మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, టీజీ టూడీ టాపర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనల మేరకు అందజేశారు. ఆపద సమయంలో ఆదుకుని, వైద్య చికిత్సకు ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి వాకిటి శ్రీహరి అన్నగారికి షరీఫ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టాల్లో తోడుగా.. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా మంత్రి ఉంటారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరచింత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు రవికాంత్, నందిమల్ల గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా జ్యోతిబా ఫూలే వర్ధంతి



గుంటూరు, నవంబరు 28,(భారత్ న్యూస్): మహాత్మా జ్యోతిరావు ఫూలే మహోన్నత సంఘ సంస్కర్త అని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే వర్ధంతిని శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలితో కలిసి జ్యోతిరావు ఫూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలు, కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన వ్యక్తి అన్నారు. బహుజనుల అభ్యున్నతికి మార్గదర్శకుడు అని కొనియాడారు. స్త్రీ విద్యకు ప్రాధాన్యతనిస్తూ తన భార్య సావిత్రిబాయి ఫూలేతో కలిసి బాలికల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని, అణగారిన వర్గాలకు విద్య, సమానత్వం, ఆత్మగౌరవం కల్పించేందుకు నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని చాటిచెప్పిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్యాభివృద్ధి కోసం మహాత్మా జ్యోతిరావు ఫూలే చేసిన సేవలు భావితరాలకు నిరంతరం స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిసెప్షన్ వేడుకకు హాజరై ఆ నూతన దంపతులను ఆశీర్వదించిన: ప్రత్తిపాటి



పల్నాడు జిల్లా చిలకలూరిపేట,నవంబరు 28.(భారత్ న్యూస్): చిలకలూరిపేట నియోజకవర్గం, నాదెండ్ల మండలం, నాదెండ్ల గ్రామానికి చెందిన నల్లమోతు సతీష్ గారి కుమారుని రిసెప్షన్ వేడుక సందర్భంగా వారు ఏర్పాటుచేసుకున్న శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం కార్యక్రమానికి హాజరై, ఆ నూతన జంట మణికంఠ - సంజన లను ఆశీర్వాదించి, వివాహ శుభాకాంక్షలు తెలియచేసిన మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు.

12 ఏళ్ల ఆలయ వార్షికోత్సవం.. అయ్యప్ప స్వామికి ఘనంగా కుంభాభిషేకం

నార్వలలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



నార్వల, నవంబర్ 28 (భారత్ రిపోర్టర్): నార్వల మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచే అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారుఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి కలశాభిషేకం, కుంభాభిషేకం, పంచామృత అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శబరిమల మేల్శాంతి పి.ఎన్. మహేష్ నంబూద్రి, ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మేంద్ర స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.ఆలయం ప్రారంభమై 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహం నెలకొంది. అయ్యప్ప స్వామి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని భక్తులు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అయ్యప్ప స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కైలాసగిరి ఘాట్ రోడ్డులో స్కూల్ బస్సు ప్రమాదం.. భద్రతా చర్యలపై అధికారుల దృష్టి సారించాలి.

బీజేపీ జనతా వారధి కో కన్వీనర్ - మూల వెంకటరావు



విశాఖపట్నం నవంబర్-28 (భారత్ రిపోర్టర్) జిల్లా ఇంచార్జ్.: కైలాసగిరి ఘాట్ రోడ్డులో శనివారం స్కూల్ బస్సు ప్రమాదానికి గురైన ఘటన ఆందోళన కలిగిస్తోందని బీజేపీ జనతా వారధి కో కన్వీనర్ మూల వెంకటరావు తెలిపారు. పిఠాపురంలోని శ్రీ ఆదర్శ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో విజ్ఞాన యాత్రకు వచ్చిన బస్సు కొండ దిగుతుండగా బ్రేకులు పనిచేయక అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు గాయపడగా, క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి కైలాసగిరి ఘాట్ రోడ్డులో వాహనాల భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ముఖ్యంగా పాఠశాలల విజ్ఞాన యాత్రల సందర్భంగా విద్యార్థులను తీసుకెళ్లే బస్సుల ఫిట్‌నెస్, బ్రేకుల పనితీరు, డ్రైవర్ల అనుభవాన్ని తప్పనిసరిగా తనిఖీ చేసేలా చర్యలు తీసుకోవాలని మూల వెంకటరావు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా భావించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రవాణా, పోలీసు, సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వినమ్రంగా కోరుతున్నట్లు మూల వెంకటరావు అన్నారు.

నార్వలలో ఓటుకు రూ.వెయ్యి పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం!

ఎన్నికల వేళ నగదు పంపిణీపై ఓటర్లలో చర్చ.. అధికారుల నిఘా అవసరం

నార్వల, నవంబర్ 28 (భారత్ రిపోర్టర్): నార్వల మండలంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తున్నట్లు కొందరు ఓటర్లు తెలిపిన సమాచారం మేరకు స్థానికంగా చర్చ సాగుతోంది.కొన్ని వార్డుల్లో సుమారు 900కు పైగా ఓట్లు ఉండగా, వాటిలో దాదాపు 600 మంది ఓటర్లకు మాత్రమే నగదు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నార్వలలో మొత్తం సుమారు 16,300 ఓట్లు ఉండగా, 11 నుంచి 12 వేల ఓట్లకు నగదు పంపిణీ జరిగే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం ఒక్కో ఓటుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తే సుమారు రూ.1.20 కోట్ల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు.అయితే నగదు పంపిణీకి సంబంధించిన వివరాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయా అనే అంశంపై ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనది. డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన అవసరం

- మెదక్ ఎంపీ రఘునందరావ్ రావు



(మెదక్ జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ రిపోర్టర్ నవంబర్ 28 శనివారం): చేగుంట 28/11/26 చేగుంట మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్ ఏర్పాటు చేసిన రాజ్యాంగ పరిషత్ సభ్యుల ఫోటో గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ వారు ప్రారంభించిన మెకాలే విద్యా విధానానికి స్వస్తి పలకాలని, రాజ్యాంగంలో ఉన్న హక్కులు, విధుల పట్ల అవగాహన ఉండాలని, దేశంలో రాజ్యాంగబద్ధ పదవిలో రాష్ట్రపతి,గవర్నర్ కొనసాగుతారని, వారి అనుమతి తోనే రాష్ట్రంలో, కేంద్రంలో చట్టాలు తయారవుతావని, రాజ్యాంగ సభ సభ్యుల వివరాలను సేకరించి, ఫోటో గ్యాలరీ ఏర్పాటు చేయడం అభినందనీయమని , వందేమాతరం అవమానిస్తే కఠిన శిక్షలు ఉంటాయని, విద్యార్థులు బాగా చదివినప్పుడే, ఉపాధ్యాయులకు మంచి పేరు వస్తుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో చేగుంట ఎంఈఓ నీరజ, డీఈఓ రాజు, చేగుంట సర్పంచ్ సంద్రంగు స్రవంతి, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ,ఉపాధ్యాయులు రాజేశ్వర్, రఘుపతి, రాధ, రమా, రమాదేవి, సురేందర్, మనోహర్ రావు, రావుల వెంకటేష్, సరస్వతి,శ్రీవాణి, రేఖ, ఉమా, ఉమామహేశ్వరి, హిమవర్ష, సిఆర్పి రమేష్, తపస్ రాష్ట్ర, జిల్లా బాధ్యులు నవాత్ సురేష్,రంగా రెడ్డి, ఎల్లం, సిద్దు, బీజేపీ మెదక్, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు వాల్దాస్ బాల్లేష్ గౌడ్, బైరి శంకర్ ముదిరాజ్, బీజేపీ చేగుంట మండల అధ్యక్షులు ఎల్లారెడ్డి, ఉపాధ్యాయ విఠల్ రెడ్డి, నరసింహారావు, పెంట గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





ఫిర్యాదుల స్థితి తెలుసుకునేందుకు 1100 కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ రద్దు

ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్థితి తెలుసుకునే అవకాశం

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫిర్యాదులు, అభిప్రాయాల నమోదు

పీజీఆర్ఎస్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయాలి

జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



అనంతపురం, నవంబర్ 28: స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను రద్దు చేసిన నేపథ్యంలో ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిని తెలుసుకునేందుకు ప్రత్యామ్నాయ సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే దాఖలు చేసిన అర్జీలు పరిష్కారం కాకపోయినా, వాటి వివరాలు తెలుసుకోవాలన్నా టోల్ ఫ్రీ కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. అలాగే మీకోసం వెబ్‌సైట్ ద్వారా అర్జీల స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 ద్వారా కూడా ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవడంతో పాటు అభిప్రాయాలు తెలియజేయవచ్చన్నారు.

పీజీఆర్ఎస్‌పై క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సేవలను మరింత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ కోరారు. పీజీఆర్ఎస్ సేవలు పొందిన వెంటనే మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ స్పందనను నమోదు చేయవచ్చన్నారు. ప్రజల అభిప్రాయాలు అధికారిక పీజీఆర్ఎస్ పోర్టల్‌కు చేరుతాయని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంపై తమ అభిప్రాయాలను స్వచ్ఛందంగా తెలియజేసి మెరుగైన సేవలందించేందుకు సహకరించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమైన వెబ్‌సైట్లు [https://meekosam.ap.gov.in](https://meekosam.ap.gov.in?utm_source=chatgpt.com)

పీజీఆర్ఎస్: [https://pgrs.ap.gov.in/Home/QRGrievance](https://pgrs.ap.gov.in/Home/QRGrievance?utm_source=chatgpt.com)

కాల్ సెంటర్: 1100

వాట్సాప్ గవర్నెన్స్: 9552300009

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

ప్రశాంతంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

9 మండలాల్లో 1,370 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

137 సర్పంచ్ స్థానాలు, 825 వార్డులకు ఎన్నికలు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్

అనంతపురం, నవంబర్ 29: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆదివారం నిర్వహించనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. రెండో విడతలో అనంతపురం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 9 మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఇందుకోసం మొత్తం 1,370 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

సర్పంచ్ స్థానాల వివరాలు

మొత్తం 186 గ్రామ పంచాయతీల్లో 51 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 137 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ పదవులకు 367 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

వార్డు సభ్యుల వివరాలు

మొత్తం 1,794 వార్డులకు నోటిఫికేషన్ జారీ చేయగా, 950 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 19 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 825 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వార్డు సభ్యులుగా 1,749 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందిని నియమించారు. శనివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో ఆర్టీసీ బస్సుల్లో తమకు కేటాయించిన కేంద్రాలకు బయలుదేరి వెళ్లారు. ఎన్నికల సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్, కౌంటింగ్ జరిగేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఇంద్రకీలాద్రిపై అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి, నవంబర్ 28: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో "ధర్మపథం" సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం 6 గంటల నుండి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వరంగల్‌కు చెందిన కొంపల్లి భ్రమరాంబ బృందం "కొలువైతివా గణపతి" "మహేశ్వరి మహాంకాళి" "మాతే మలయధ్వజ" "భైరవాష్టకం" "శృంగార లహరి కీర్తన" అంశాలకు ఎంతో అద్భుతంగా అభినయించి, నాట్య ప్రదర్శనతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపారు. అమ్మవారి దర్శనార్థం ఇంద్రకీలాద్రికి విచ్చేసిన భక్తులు ఈ నృత్య ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి కళా బృందాన్ని అభినందించారు.

శ్రీ భవానీ మండల దీక్షా విరమణ మహోత్సవాలకు ఏర్పాట్లు

- హోమగుండాలు, ఇరుముడి సమర్పణ ప్రదేశాల పరిశీలన



ఇంద్రకీలాద్రి, నవంబర్ 28: శ్రీ పరాభవ నామ సంవత్సర శ్రీ భవానీమండల దీక్ష ఉత్సవాలు -- 2026లో భాగంగా, వచ్చే నెలలో జరగనున్న శ్రీ భవానీ మండల దీక్ష విరమణ మహోత్సవాలకు ఇంద్రకీలాద్రి దేవస్థానం ఇప్పటి నుంచే పకడ్బందీ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టింది. శనివారం ఉదయం దేవస్థాన కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ దేవస్థానం వైదిక కమిటీ, ఇంజినీరింగ్ మరియు పరిపాలనా విభాగాల అధికారులు, సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన జరిపారు. దీక్షా విరమణకు లక్షలాదిగా తరలిరానున్న భవానీ దీక్షాధారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శాస్త్రోక్తంగా హోమగుండాల ఏర్పాటు, దీక్షా విరమణ మరియు ఇరుముడి సమర్పణ ప్రదేశాల ఎంపికపై ఈవో అధికారులతో సమీక్షించి తగు సూచనలు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, పారిశుధ్యం మరియు భద్రతా ఏర్పాట్లపై ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు కోట రవికుమార్, అర్చకులు వి.శ్రీధర్ శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్.రమ,ఏ ఈవో ఎన్. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భవానీ దీక్షా విరమణ ముఖ్య ఘట్టాలు:

దీక్షా విరమణ తేదీలు: 30 డిసెంబర్ 2026 (బుధవారం) నుండి 03 జనవరి 2027 (ఆదివారం) వరకు. - 30 డిసెంబర్ 2026 (బుధవారం): ఉదయం 6:30 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, శత చండీయాగం మరియు 'గిరి ప్రదక్షిణ' ప్రారంభం. - 03 జనవరి 2027 (ఆదివారం): ఉదయం 10:00 గంటలకు మహా పూర్ణాహుతి, భవానీ దీక్షల సమాప్తి. - దీక్షా ఉత్సవాలకు సంబంధించిన పూర్తి వివరాల కోసం భక్తులు దేవస్థానం టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 9099 ను సంప్రదించవచ్చని ఈవో తెలిపారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే ఎంపీ రఘునందన్ రావు

(మెదక్ జిల్లా ప్రతినిధి భారత్ రిపోర్టర్ నవంబర్ 28 శనివారం.): ఈరోజు చేగుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అండర్ 14 అండర్ 17 అండర్ 19 బాల బాలికల ఫెన్సింగ్ పోటీలకు ముఖ్యఅతిథిగా వచ్చిన మెదక్ ఎం. పి రఘునందన్ రావు గారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ముఖ్యమని అన్నారు. క్రీడలు ఆరోగ్యంతో పాటు ఉపాధి, ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు 2% కోటా కింద ఎంతో ఉపయోగపడుతుందని, కావున ప్రతి ఒక్కరూ వారికి నచ్చిన క్రీడలలో పాల్గొంటూ ఉన్న ఊరుకు, చదువుతున్న పాఠశాలకు, కళాశాలలకు, జిల్లాకు,రాష్ట్రానికి, దేశానికి తల్లి తండ్రులకి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ప్రధాని మోడీ గారు క్రీడలకు ప్రాధాన్యమిస్తూ ఖేలో ఇండియా పోటీలు ప్రవేశపెట్టారని ఖేలో ఇండియా పోటీల ద్వారా ఎంతో మంది క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని రాష్ట్రానికి దేశానికి ప్రాతినిధ్యం వహించి ఎన్నో పథకాలు సాధించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకున్నారని ఆయన అన్నారు.

ఈ రోజు జరిగిన పోటీలలో

విజేతలు వీరే

అండర్ 14 బాలికల ఫాయిల్ విభాగంలో ,అస్మిత, ఆధ్యా శశి,శాలిని, విగ్నేశ్వరి,సాబేర్ విభాగంలో జ్యోతి, శరణ్య, హాసిని,

స్వాతి ,ఈపీ భాగంలో,మహిమ, జయలక్ష్మి, సారిక ,,సాన్విక,,అండర్ 14 బాలుర విభాగంలో,ఫాయిల్ విభాగంలో ,లక్కీ, అజయ్,నవతేజ్,నవదీప్,సాబేర్ విభాగంలో ,భరత్ ,మనోజ్, హర్షవర్ధన్,ప్రణీత్,,ఈపీ విభాగంలో,మహేందర్,భరత్ రాజ్,హరికృష్ణ,సాత్విక్,అండర్ 17 బాలికల ఫాయిల్ విభాగంలో ,,కీర్తన,భవాని,ఎస్తేర్ రాణి,ఐశ్వర్య,,సాబేర్ విభాగంలో,,జెస్సికా, అనురాధ,వర్ష,అలేఖ్య,,ఈపీ విభాగంలో,,సహస్ర,దీప్తి,ఐశ్వర్య, కనకలక్ష్మి ,,అండర్ 17 బాలుర ఫాయిల్ విభాగంలో ,,ధనుష్,,సాబేర్ విభాగంలో ,,అభిజిత్ కుమార్,రాహుల్,పండు,సాబేర్,రాకేష్,చరణ్,అరవింద్, ఆంజనేయులు ,ఈపీ విభాగంలో ,రిత్విక్,రాఘవేందర్, వినయ్ కుమార్, రంజిత్ కుమార్ ,అండర్ 19 బాలికల,ఫాయిల్ విభాగంలో ,భార్గవి, యం. శ్రీజ,అశ్విత, ఎల్ శ్రీజ,,సాబేర్ విభాగంలో ,నిఖిత,హరిప్రియ,గీతిక, అర్చన ,ఈపీ విభాగం లో,నందిని, ఎస్తేర్ రాణి, ధన లక్ష్మి,ఉషశ్రీ,అండర్ 19 బాలుర ఫాయిల్ విభాగంలో ,రాజేందర్,ప్రభాస్,స్టార్విన్,సాబేర్ విభాగంలో ,విత్తు, నరేష్, వరుణ్ సందేశ్,చైతన్య,ఈపీ విభాగంలో,చందు,అజయ్, ఫైజాన్,జగదీష్, గెలుపొందారనీ కోచ్ కరణం గణేష్ రవికుమార్ తెలిపారు.గెలిచిన వీరందరూ వచ్చే నెల మొదటి వారంలో కరీంనగర్ జిల్లా రేకుర్తిలో జరిగే రాస్తాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు వీరి గెలుపు పట్ల ఉమ్మడి మెదక్ జిల్లా కార్యనిర్వాహ కార్యదర్శులు నాగరాజు శ్రీనివాస్ భాస్కర్ రెడ్డి గణపతి సమ్మయ్య హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున్ స్పోర్ట్స్ ఇన్చార్జి ప్రమోద్ సిద్దిపేట జిల్లా బిజెపి అధ్యక్షుడు బైరి శంకర్



కళాశాల సిబ్బంది చేగుంట మండల బిజెపి అధ్యక్షులు ఎల్లారెడ్డి భూపాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సుజాత మహిళా మోర్చా అధ్యక్షురాలు లావణ్య స్వాతి సంతోష్ రెడ్డి భూపాల్ రెడ్డి రతన్ తదితరులు పాల్గొన్నారు



బుచ్చిరాజుపాలెంలో అక్రమ 5 అంతస్తుల భవన నిర్మాణం..

అధికారుల సహకారంతో జీవీఎంసీ ఆదాయానికి గండి!

భారత్ రిపోర్టర్ ?విశాఖపట్నంనవంబర్ 28: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని బుచ్చిరాజుపాలెం ప్రాంతంలో భవన నిర్మాణ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి అక్రమంగా 5 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్లు స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం 8 అడుగుల వెడల్పు గల సన్నని రోడ్డులో ఈ భారీ భవనాన్ని సుమారు 20 ఫ్లాట్లుగా నిర్మిస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల ఉల్లంఘన -- ఆదాయానికి గండి

రోడ్డు వెడల్పు నిబంధనల ఉల్లంఘన: 8 అడుగుల సన్నని రోడ్డులో బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులు ఉండవని, అయినప్పటికీ నిబంధనలను పక్కనపెట్టి నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



?అనధికార అదనపు అంతస్తులు: ఎటువంటి సరైన అనుమతులు లేకుండా అదనపు అంతస్తులు నిర్మిస్తూ, జీవీఎంసీకి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి (బిల్డింగ్ ప్లాన్ ఫీజులు, ఇతర ఛార్జీలు) భారీగా గండి కొడుతున్నట్లు సమాచారం.

కార్పొరేటర్ అండదండలు -- ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం?

కొత్తగా ఏర్పడిన జీవీఎంసీ కార్పొరేటర్ సహకారంతోనే ఈ అక్రమ నిర్మాణం యథేచ్ఛగా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ, నిర్మాణదారులకు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజలకు ముప్పు.. చర్యలకు డిమాండ్

ఇరుకైన 8 అడుగుల రోడ్డులో 20 ఫ్లాట్ల భవనం నిర్మిస్తే భవిష్యత్తులో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలతో పాటు అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని స్థానిక నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ కమిషనర్, విజిలెన్స్ విభాగం వెంటనే స్పందించి ఈ అక్రమ భవన నిర్మాణాన్ని నిలిపివేయాలని, అలాగే అక్రమాలకు సహకరించిన ప్లానింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బుచ్చిరాజుపాలెం వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అనధికార నిర్మాణంలో ఎవరి వాటా ఎంత? పూర్తి వివరాలురేపటి దినపత్రికలో చుడండి.

మత్తు పదార్థాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు "త్రిశూల్" కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్

అనంతపురం, నవంబర్ 28: జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి మాదకద్రవ్యాల నివారణ, రోడ్డు భద్రత, మహిళల భద్రత, బాల్యవివాహాల నిర్మూలన తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎక్సైజ్, పోలీస్, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రయం, వినియోగం, అక్రమ రవాణాపై అందే సమాచారానికి తక్షణమే స్పందించేలా నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారులకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు క్షేత్రస్థాయి అధికారులు చురుగ్గా పనిచేయాలని తెలిపారు.



త్రిశూల్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

మహిళా భద్రత, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన అనే మూడు ప్రధాన అంశాలపై సమగ్ర పర్యవేక్షణ కోసం ముఖ్యమంత్రి "త్రిశూల్" కార్యక్రమానికి రూపకల్పన చేశారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఈ మూడు అంశాలపై అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బాల్యవివాహాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, వాటికి పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన శిక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

బ్లాక్‌స్పాట్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లాలో గుర్తించిన ప్రమాదకర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాదాలకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, లైటింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సరైన



వెలుతురు లేక ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి పూర్తిస్థాయిలో లైటింగ్ ఏర్పాటు చేయాలని, భద్రతా చర్యల్లో నిర్లక్ష్యం వహించకూడదని జాతీయ రహదారుల అధికారులకు స్పష్టం చేశారు. గ్రామాలు, తండాల్లో మహిళా భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

వదాన్య టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఓ ఆనంద్

డిసెంబర్ 27న టాలెంట్ టెస్ట్ నిర్వహణ

రూ.5 లక్షల విలువైన బహుమతులు, స్కాలర్‌షిప్‌లు

ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు అవకాశం

రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8 చివరి తేదీ

అనంతపురం, నవంబర్ 28: వదాన్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న టాలెంట్ టెస్ట్--2026 పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వదాన్య వ్యవస్థాపకులు అశోక్ పడపాటి మాట్లాడుతూ ఈ ఏడాది శ్రీ సత్యసాయి జిల్లాతో పాటు తొలిసారిగా అనంతపురం జిల్లాలో కూడా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు రెండు జిల్లాల నుంచి సుమారు 5 వేల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈసారి 8 వేల మంది వరకు పరీక్షకు హాజరవుతారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. గత 15 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి వదాన్య కృషి చేస్తోందన్నారు. గత ఐదేళ్లుగా శ్రీ సత్యసాయి జిల్లాలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ ద్వారా గ్రామీణ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ద్వారా గుర్తింపు పొందిన పలువురు విద్యార్థులు ఐఐటీ, ఐఐఎస్సీ, ఎన్ఐటీ, వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందారని వివరించారు. ఈ పరీక్ష 100 మార్కులకు నిర్వహించనుండగా, గణితానికి 90 మార్కులు, కృత్రిమ మేధస్సుకు 10 మార్కులు కేటాయించారు. రెండు జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ప్రతిభ కనబరిచిన వారికి మొత్తం రూ. 5 లక్షల విలువైన బహుమతులు, ఉపకార వేతనాలు అందజేయనున్నారు.



పరీక్ష వివరాలు

పరీక్ష తేదీ: డిసెంబర్ 27, 2026 సమయం: ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష కేంద్రాలు: కొత్తచెరువు, అనంతపురం రిజిస్ట్రేషన్ చివరి తేదీ: డిసెంబర్ 8 హాల్ టికెట్ల డౌన్‌లోడ్: డిసెంబర్ 10 నుంచి

పరీక్ష సిలబస్,రిజిస్ట్రేషన్, ఇతర వివరాలను [https://www.vadaanya.org](https://www.vadaanya.org?utm_source=chatgpt.com) వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని అశోక్ పడపాటి తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



‘ఇండియా’ కూటమికి స్టాలిన్ షాక్?!



చెన్నై: నవంబర్ 30న ప్రారంభం కానున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకు ముందు ప్రతిపక్ష ఇండియా కూటమికి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ ఊహించని షాక్ ఇచ్చారు. డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లుకు మద్దతు ఇవ్వాలని స్టాలిన్ నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లకు అంగీకరించడం వల్లే డీఎంకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న డీలిమిటేషన్ బిల్లు ముసాయిదాపై చర్చించేందుకు, శనివారం ఉదయం స్టాలిన్ తన పార్టీకి చెందిన 22 మంది లోక్‌సభ, 8మంది రాజ్యసభ ఎంపీలతో సమావేశమయ్యారు. ఈ భేటీలో బిల్లుకు మద్దతు పలికేలా పార్టీ వైఖరిని ఖరారు చేసినట్లు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల వరకు ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న డీఎంకే, ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కేంద్రం అంగీకరించిన డీఎంకే ప్రధాన డిమాండ్లు

డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ఉండేందుకు డీఎంకే కేంద్రం ముందు రెండు ప్రధాన డిమాండ్లను ఉంచింది.వాటిని పరిష్కరిస్తామని కేంద్రం హామీ ఇచ్చినట్లు డీఎంకే నేతలు పేర్కొంటున్నారు. లోక్‌సభ స్థానాల్లో తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.18 శాతం వాటాను యథాతథంగా కాపాడాలి. రాష్ట్రాల సాపేక్ష ప్రాతినిధ్య నిష్పత్తిని 2051 వరకు (మరో 25 ఏళ్ల పాటు) మార్చకుండా స్తంభింపజేయాలి. ప్రస్తుతం ప్రతిపాదించిన సవరించిన ఫార్ములా ప్రకారం, రాష్ట్రాల మధ్య ఉన్న పార్లమెంటరీ ప్రాతినిధ్య పంపిణీ నిష్పత్తిని యథాతథంగా కొనసాగిస్తారు. అదే సమయంలో, దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ, అసెంబ్లీ సీట్లను ఏకరీతిగా 50 శాతం మేర పెంచాలని ప్రతి పాదిస్తున్నారు.

21 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై హరీశ్‌రావు, జగ్గారెడ్డి



సంగారెడ్డి: కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తాజాగా ఒకే వేదికపై కలిశారు. అయితే వీరిద్దరూ కలవడం 21 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. అయితే ఇది రాజకీయ వేదిక కాదు.. ఓ పెళ్లి వేడుక. అది కూడా జగ్గారెడ్డి కుమారుని పెళ్లి వేడుక. దీనికి హరీష్‌రావును జగ్గారెడ్డి ఆహ్వానించడంతో వీరి కలయిక రెండు దశాబ్దాల తర్వాత అనివార్యమైంది. జగ్గారెడ్డి కుమారుడు భరత్ సాయి రెడ్డి వివాహానికి హరీశ్ హాజరయ్యారు. భరత్ సాయి రెడ్డి- కోడలు పాలక్ పటేల్‌లను హరీశ్ ఆశీర్వదించారు. అదే సమయంలో హరీష్-జగ్గారెడ్డిలు కబుర్లు చెప్పుకుంటూ కాసేపు ఉల్లాసంగా కనిపించారు. అయితే తనకు హరీశ్‌తో ఉన్న పరిచయం, 21 ఏళ్ల తర్వాత జరిగిన కలయికపై జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ ఇద్దరి మధ్య జరిగిన సమావేశంలో ఎలాంటి రాజకీయాలు, మతలబులు లేవని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. 2004లో హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆయనతో కలిసి తన ఛాంబర్‌లో భోజనం చేసేవాడినని జగ్గారెడ్డి గుర్తుచేశారు. ఆ తర్వాత తాను కాంగ్రెస్‌లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు హరీశ్ రావును కలవలేదని తెలిపారు.

21 ఏళ్ల తర్వాత కలుసుకున్న హరీష్ రావు, జగ్గారెడ్డి

దాదాపు 21 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఓ కుటుంబ కార్యక్రమంలో ఇద్దరం మళ్లీ కలుసుకున్నామని చెప్పారు. తన కుమార్తె వివాహానికి హరీశ్ రావును ఆహ్వానించలేకపోయానని, అయితే ఈ కుటుంబ వేడుకకు మాత్రం ఆయనను ఆహ్వానించానని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని హరీశ్ రావు మిస్ కావొద్దనే ఉద్దేశంతో పిలిచినట్లు పేర్కొన్నారు.

డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు: కేటీఆర్



హైదరాబాద్: డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గకూడదని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్ అమలుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. తెలంగాణకు ఎలాంటి అన్యాయం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన ఖాతాలో ట్వీట్ చేశారు. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న 24 శాతం ప్రాతినిధ్య వాటాను కాపాడాలని తాము నిరంతరం డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రతిపాదిత విధానం ప్రకారం పార్లమెంట్ స్థానాలను 50 శాతం పెంచడంతో పాటు, 2051 వరకు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిలో మార్పులు చేయకుండా రక్షణ కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాదన అమలైతే తెలంగాణలో లోక్‌సభ స్థానాలు ప్రస్తుతం ఉన్న 17 నుంచి 26కు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ఈ ప్రతిపాదనకు అనుకూలంగా తమ ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఓటు వేయనున్నట్లు వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లకు తాము ఎప్పటి నుంచో మద్దతు ఇస్తున్నామని, వాటిని అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.ం

జమ్మూ కశ్మీర్‌కు కొత్త అడ్వకేట్ జనరల్.. ఎవరీ ఫైసల్ ఖాద్రీ?



శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతానికి కొత్త అడ్వకేట్ జనరల్ నియమితులయ్యారు. సీనియర్ న్యాయవాది సయ్యద్ ఫైసల్ ఖాద్రీ నియామకానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం తెలిపారు. దీంతో రెండేళ్లకు పైగా ఖాళీగా ఉన్న ఈ కీలక రాజ్యాంగబద్ధ పదవి భర్తీ కానుంది. 2024 అక్టోబర్‌లో అప్పటి అడ్వకేట్ జనరల్ డీసీ రైనా రాజీనామా చేసినప్పటి నుంచి ఈ పదవి ఖాళీగానే ఉంది. సయ్యద్ ఫైసల్ ఖాద్రీ జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ హైకోర్టుల్లో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. పలు కీలక రాజ్యాంగపరమైన, సర్వీసు సంబంధిత కేసుల్లో ప్రభుత్వం, వివిధ శాఖల తరఫున వాదనలు వినిపించారు. 2020 డిసెంబర్ 3న ఆయనకు సీనియర్ అడ్వకేట్ హోదా లభించింది. 2024 అక్టోబర్‌లో అప్పటి అడ్వకేట్ జనరల్ డీసీ రైనా తన పదవికి రాజీనామా చేశారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ఎన్నికైన ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ పదవిని భర్తీ చేయాలని కోరుతూ వచ్చింది. తాజాగా మనోజ్ సిన్హా ఆమోదం తెలపడంతో నియామకానికి మార్గం సుగమమైంది. త్వరలో అధికారిక ఉత్తర్వులు వెలువడనున్నట్లు అధికారులు వెల్లడించారు. అడ్వకేట్ జనరల్‌గా సయ్యద్ ఫైసల్ ఖాద్రీ కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వానికి ప్రధాన న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో కీలక కేసుల విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. పౌర, క్రిమినల్, రాజ్యాంగపరమైన అంశాల్లో ప్రభుత్వానికి న్యాయపరమైన సలహాలు అందిస్తారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 165 ప్రకారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌ను నియమిస్తారు. ప్రభుత్వానికి ప్రధాన న్యాయ సలహాదారుగా ఉండటంతో పాటు కోర్టుల్లో ప్రభుత్వ వాదనలు వినిపించడం ఆయన బాధ్యత. గవర్నర్ లేదా ప్రభుత్వం సూచించిన అంశాలపై న్యాయపరమైన అభిప్రాయాలు అందిస్తారు. అవసరమైనప్పుడు రాష్ట్ర శాసనసభ సమావేశాలు, కమిటీలకు హాజరై తన అభిప్రాయాలను వెల్లడించవచ్చు. అయితే అక్కడ ఓటు వేసే అధికారం ఉండదు. సయ్యద్ ఫైసల్ ఖాద్రీ కశ్మీర్ యూనివర్సిటీలో 2004లో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ఆయన తండ్రి ప్రొఫెసర్ అష్టల్ ఖాద్రీ కశ్మీర్ యూనివర్సిటీ న్యాయ విభాగానికి గతంలో అధిపతిగా, డీన్‌గా పనిచేశారు. క్రిమినల్ లా నిపుణుడిగా, అధ్యాపకుడిగా గుర్తింపు పొందారు. తండ్రి న్యాయరంగంలో విశేష అనుభవం కలిగిన వ్యక్తి కాగా, కుమారుడు కూడా అదే రంగంలో ఎదిగి తాజాగా జమ్మూ కశ్మీర్ అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు.

భయంభయంగా బాల్యం.. భవితపై ప్రభావం

చదువులు, ర్యాంకుల పేరుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిళ్లు

ప్రైవేట్ స్కూళ్లలో కొందరు టీచర్ల బాధ్యతారాహిత్యం

పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

ఇలాంటి చర్యలకు బాధ్యులపై చట్టంలో కఠిన శిక్షలు

పలు దేశాల్లో పాఠశాల పిల్లలపై భౌతికదాడులు నిషేధం

అలాంటివి ఇక్కడ కూడా అమల్లోకి రావాలంటున్న తల్లిదండ్రులు

అమరావతి: పాఠశాల అంటే పిల్లలకు భయపెట్టే ప్రదేశం కాదు.. భవిష్యత్తును తీర్చిదిద్దే వేదిక. కానీ హోంవర్క్ చేయకపోయినా, మార్కులు తగ్గినా, చదువులో వెనుకబడినా కొందరు టీచర్లు విపరీతంగా వ్యవహరిస్తున్నారు. తిట్టి, బెదిరించి, అవమానిస్తున్నారు. బెత్తంతో కొట్టి శారీరకంగా శిక్షిస్తున్నారు. ముఖ్యంగా మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులపై ఒత్తిడి విపరీతంగా పెంచుతున్నారు. ఫలితంగా పసిప్రాయం భయపడుతోంది. పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యం దెబ్బతింటోంది. ఇది పెను అనర్థాలకు దారితీస్తోంది.

ప్రైవేటు పాఠశాలల్లోనే వేధింపులు

‘ దేశవ్యాప్తంగా 2024--25 విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో 24.69 కోట్లమంది విద్యార్థులు చదువుతున్నట్లు యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (యూడైస్) గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో 9.59 కోట్లమంది ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఉన్నారు. అంటే మొత్తం విద్యార్థుల్లో సుమారు 39 శాతం మంది ప్రైవేట్ స్కూళ్లలోనే చదువుతున్నారు. ‘ ఇటీవల 15 నగరాల్లో నిర్వహించిన ఓ అధ్యయనంలో 4 నుంచి 8 తరగతుల విద్యార్థుల్లో 42 శాతం మంది, 9 నుంచి 12 తరగతుల వారిలో 36 శాతం మంది పాఠశాలలో బుల్లీయింగ్ లేదా వేధింపులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ‘ జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సర్వేలో 11 శాతం



మంది విద్యార్థులు తీవ్ర ఆందోళన, 14 శాతం మంది తీవ్ర భావోద్వేగాలు, 43 శాతం మంది ‘మూడ్’ మార్పుల సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వెల్లడైంది. ‘ దేశవ్యాప్తంగా 13,044 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల్లో తేలింది. ఇది మొత్తం ఆత్మహత్యల్లో 7.6 శాతం. ‘ దీర్ఘకాలిక ఒత్తిడి, వేధింపులు ఎదుర్కొనే పిల్లల్లో ఆందోళన, నిద్ర సమస్యలు, డిప్రెషన్ వంటి మానసిక సమస్యల ప్రమాదం పెరుగుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ‘ బాల్యంలో ఎదురైన భయం, అవమానం కొన్ని సందర్భాల్లో దీర్ఘకాలిక అనర్థాలకు కారణం కావచ్చని హెచ్చరిస్తున్నాయి.

చట్టం ఏం చెబుతోంది?

విద్యార్థిని కొట్టడం తప్పు అన్నది అందరికీ తెలిసిన ప్రాథమిక నియమం. అయితే అందరి ముందు అవమానించడం, ‘నువ్వు పనికిరావు’ అంటూ తిట్టడం, ఇతర పిల్లలతో పోల్చడం, తక్కువ మార్కులకు బెదిరించడం, గంటల తరబడి నిలబెట్టడం వంటి చర్యలు కూడా పిల్లల్లో భయం, ఆత్మన్యూనత భావాన్ని పెంచవచ్చు. 2009 విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం పిల్లలకు శారీరక శిక్ష, మానసిక వేధింపులు నిషేధం. అదేవిధంగా జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్ 75 కింద పిల్లలపై క్రూరత్వానికి శిక్షలున్నాయి. తీవ్ర శారీరక లేదా మానసిక నష్టం, ప్రాణాపాయం వంటి పరిస్థితుల్లో కనీసం మూడేళ్ల నుంచి పదేళ్ల వరకు కఠిన కారాగారశిక్ష, రూ.5 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. లైంగిక వేధింపుల విషయంలో పోక్సో చట్టం కింద మరింత తీవ్రమైన నేరాలు నమోదు చేయవచ్చు. అందుకే పిల్లల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యాలు ఏమాత్రం రాజీపడకూడదు.

విదేశాల్లో ఇలా కుదరదు

పిల్లలపై వేధింపుల విషయంలో అనేక దేశాలు మరింత కఠిన విధానాలను అవలంబిస్తున్నాయి. ఉదాహరణకు వేల్స్‌లో 2022 మార్చి 21 నుంచి పిల్లలను శారీరకంగా శిక్షించడం చట్టవిరుద్ధం. పిల్లలకు పెద్దలతో సమానంగా దాడి నుంచి చట్టపరమైన రక్షణ కల్పించారు. అమెరికాలో పలు రాష్ట్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో శారీరక శిక్షను నిషేధించాయి. ఆస్ట్రేలియా విద్యార్థుల భద్రత, గౌరవం, మానసిక ఆరోగ్యం, కుటుంబ భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రత్యేకదృష్టి పెడుతోంది. ఈ ఏడాది అక్కడ జాతీయ యాంటీ--బుల్లీయింగ్ ఫ్రేమ్‌వర్క్ అమలుకు చర్యలు ప్రారంభించారు.

మీ పిల్లల్ని ఇలా అడగండి

పిల్లలు స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన తర్వాత హోంవర్క్ చేశావా? ఎన్ని మార్కులు వచ్చాయి? అని మాత్రమే అడిగితే సరిపోదు. ఈరోజు స్కూల్లో ఎలా గడిచింది? ఎవరైనా నిన్ను ఇబ్బంది పెట్టారా? ఏ టీచర్ అంటే భయంగా ఉంది? ఏదైనా చెప్పాలనుకుంటున్నావా? అని తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలను అడగాలి. ఒక్కసారిగా పిల్లల్లో మార్పు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. స్కూల్‌కు వెళ్లడానికి ఇష్టపడకపోవడం, తరచు కడుపునొప్పి లేదా తలనొప్పి అని చెప్పడం, నిద్రలో మార్పులు, చదువుపై ఆసక్తి తగ్గడం, భయపడటం, ఒంటరిగా ఉండటం వంటి సంకేతాలను నిశితంగా గమనించాలి. కారణాలు కనుక్కుని అవసరమైతే పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడాలి.

టీచర్లు ఎలా నడుచుకోవాలి

‘ ఉపాధ్యాయుడు తన చేతిలో ఉన్నది కేవలం పుస్తకం కాదు.. పిల్లల భవిష్యత్తు అని గుర్తించాలి

‘ విద్యార్థి తప్పుచేస్తే అర్థమయ్యేలా వివరించి చెప్పాలి.. అంతేగానీ అవమానించకూడదు

‘ తక్కువ మార్కులు వస్తే కారణం తెలుసుకోవాలి.. ఇతర పిల్లలతో పోల్చకూడదు

‘ భయపెట్టి కాకుండా.. ప్రోత్సహించి చదివించాలి

‘ పిల్లల ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే తల్లిదండ్రులతో మాట్లాడాలి

‘ కోపం వస్తే శిక్ష విధించకుండా పరిస్థితిని శాంతంగా ఎదుర్కోవాలి

‘ పిల్లలు తమ సమస్యలు చెప్పుకొనేలా సురక్షిత వాతావరణం కల్పించాలి

2024--25 యూడైస్ గణాంకాల ప్రకారం..

దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులు: 24.69 కోట్లు

ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు: 9.59 కోట్లు

మొత్తం విద్యార్థుల్లో ప్రైవేటు బడుల విద్యార్థుల శాతం: 39

టీచర్ల వేధింపులతో బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల సంఖ్య: 13,044

భూతాపంతో మారిపోతున్న పూల పరిమళాలు..

పర్యావరణంలో ఏర్పడిన అసమతుల్యత పిచ్చుక మనుగడను ప్రశ్నార్థకం చేసింది. భూతాపం మితిమీరడం ఇప్పుడు పూల మీద ప్రభావం చూపిస్తోంది. పూల వాసనల్లో తేడాలు వస్తున్నాయి. పరపరాగ సంపర్కం జరగడానికి విడుదల కావాల్సిన సంకేతాలు కృతి తప్పుతున్నాయి. అడవిలో గాలి ఒక విచిత్రమైన సువాసనలతో నిండి ఉంటుంది. శాస్త్రవేత్తలు దీనిని భాష్పశీల సేంద్రియ సమ్మేళనాలుగా (వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్) చెబుతారు. మొక్కలు, పూలు విడుదల చేసే ఈ రసాయన సమ్మేళనాలే ప్రకృతికి ప్రత్యేకమైన పరిమళాన్నిస్తాయి. ఇప్పుడు గ్లోబల్ వారి?మంగ్ ఈ సమతుల్యతకు విఘాతం కలిగిస్తోంది. వేడెక్కుతున్న భూమి, వాతావరణంలో మార్పులు ఈ సువాసనల స్వరూపాన్ని మార్చేస్తున్నాయి. దీంతో ఈ సువాసనల మీద ఆధారపడి నడుస్తున్న జీవావరణ వ్యవస్థ ఒడిదొడుకులకు లోనవుతోంది.

పరాగసంపర్కం!

పూలు విడుదల చేసే సువాసనలు తేనెటీగలు, సీతాకోకచిలుకలు వంటి కీటకాలను ఆకర్షిస్తాయి. తద్వారా పరాగసంపర్కం జరిగి, మొక్కల ప్రత్యుత్పత్తి, ఆహార పంటల దిగుబడికి దోహదం చేస్తుంది.

వాసన ఒక రక్షణ కవచం!

ఏదైనా కీటకం లేదా శత్రువు మొక్కలపై దాడి చేసినప్పుడు, మొక్కలు ప్రత్యేకమైన రసాయన వాసనలను విడుదల చేసి ఇతర మొక్కలను అప్రమత్తం చేస్తాయి. ఈ వాసన వాటికి ఒక సమాచార వ్యవస్థ. వాసన అందగానే ఆ కీటకాలను తినే పెద్ద కీటకాలు, పక్షులు వచ్చి చేరతాయి.





వాతావరణ మార్పుల ప్రభావం!

ఉష్ణోగ్రతలు పెరగడం, కరువు పరిస్థితులు ఏర్పడటం, వాతావరణంలో కాలుష్యం పెరగడం వల్ల ఈ సువాసనల విడుదల చక్రం అస్తవ్యస్తమవుతోంది. మొక్కలు అధిక వేడికి గురవడం వల్ల అవి విడుదల చేసే సువాసనల పరిమాణం, నాణ్యతలో మార్పు వస్తోంది. అవి విడుదల చేసే భాష్పశీల సేంద్రియ సమ్మేళనాల పరిమాణం, వాటి రసాయన కూర్పు మారిపోతున్నాయి. కొన్ని పూలు తమ సహజ సువాసనను కోల్పోతుండగా, మరికొన్ని భిన్నమైన వాసనలను విడుదల చేస్తున్నాయి. వాతావరణంలో పెరిగిన కాలుష్య కారకాలు, అధిక ఉష్ణోగ్రతల వల్ల పూల నుంచి వెలువడే సువాసన అణువులు గాలిలో ఎక్కువ దూరం ప్రయాణించకముందే విచ్ఛిన్నమైపోతున్నాయి అంటే పూల పరిమళం ఆ మొక్క నుంచి ప్రయాణం మొదలుపెట్టి మరో మొక్కకు చేరకముందే గాలిలోనే నశిస్తోంది.

పర్యావరణంపై చూపించే పరిణామాలు!

మొదట చెప్పుకున్నట్లు సువాసన ఒక సమాచార వ్యవస్థ. ప్రకృతిలో ఈ ‘వాసనల భాష’మారిపోవడం వల్ల పర్యావరణ సమతుల్యతకు మరో కొత్త సవాల్ ఎదురవుతోంది. పూల సువాసనలను పసిగట్టి వాటి వద్దకు చేరుకునే తేనెటీగలు, ఇతర పరాగసంపర్క కీటకాలు, మారిన వాసనల వల్ల పూలను కచ్చితంగా గుర్తించలేక దారి తప్పుతాయి. కీటకాలు పూలను సరిగ్గా గుర్తించలేకపోతే పరాగసంపర్కం తగ్గిపోతుంది. ఇది అడవుల విస్తరణపైనే కాకుండా, మనం తినే పండ్లు, కూరగాయలు, ఆహార ధాన్యాల ఉత్పత్తిపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది ఆహార భద్రతకు మరో సవాల్. భూతాపం కేవలం ఉష్ణోగ్రతలను పెంచడమే కాకుండా, ప్రకృతిలోని జీవరాశులు ఒకదానితో ఒకటి మౌనంగా సంభాంచుకునే ‘సువాసనల వారధి’ని కూడా కూల్చివేస్తోంది.

మళ్లీ ట్రంప్ సుంకాల బాణం

అంతర్జాతీయంగా ఛీత్కారాలు ఎదురైనా, స్వదేశంలో న్యాయస్థానాలు కాదన్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలను వేధించటానికే నిశ్చయించు కున్నట్టు కనబడుతోంది. తాజాగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ ఇచ్చిన నివేదిక (యూఎస్‌టీఆర్) మన దేశంతోపాటు చైనా, జపాన్ తదితర 14 దేశాలపై అదనపు సుంకాలు విధించాలని సిఫార్సు చేసింది. వచ్చే ఏడాది అమలయ్యే ఈ సిఫార్సుల్లో మన దేశానికే కాస్త వెసులుబాటు దొరికినట్టు. కానీ దానికో మెలికవుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరితే 17 శాతం సుంకాలు, లేనట్టయితే 25 శాతంపెంచాలని నివేదిక సిఫార్సు చేసింది. మొన్నీమధ్యే ట్రంప్ చైనాలోని షెన్‌జెన్ పోయి చైనా, రష్యా అధినేతలతో త్రైపాక్షిక సమావేశం జరిపారు. ప్రపంచానికి ఒరిగిందేమీ పెద్దగా లేకపోయినా, కనీసం వాళ్ల ముగ్గురిమధ్యా ఏదో మేర అవగాహన కుదిరిందన్న అభిప్రాయం కలిగింది. కానీ పదిరోజులు దాటకుండానే ట్రంప్ సుంకాల అస్త్రం బయటికి తీశారు. గత అదనపు సుంకాలు చెల్లబోవని అక్కడి సుప్రీంకోర్టు తీర్పునిచ్చాక మొన్న మార్చిలో యూఎస్‌టీఆర్ ప్రక్రియ మొదలైందంటేనే ట్రంప్ దురుద్దేశం అర్థమవుతుంది. ఈసారి సాకు చిత్రమైనది. ఇప్పుడు సుంకాలు విధించబోయే దేశాలన్నీ మార్కెట్ డిమాండ్‌కు మించి సరుకుల్ని ఉత్పత్తి చేయగల సామర్థ్యంలో ఉన్నాయట! అందుకని యూఎస్‌టీఆర్‌లోని సెక్షన్ 301 కింద దర్యాప్తు మొదలెట్టి ఈ నిర్ణయం తీసుకున్నారట. నివేదికను నిశితంగా పరిశీలిస్తే ఆరు ఆగ్నేయాసియా దేశాల ఆర్థిక వ్యవస్థలపైనా, చైనాపైనా అమెరికా



శీతకన్నేసిందని తెలుస్తుంది. ఫిలిప్పీన్స్‌లోని మనీలాలో ఇటీవలి ఆగ్నేయాసియా దేశాల (ఆసియాన్) శిఖరాగ్ర సదస్సుకు ట్రంప్ హాజరయ్యారు. అయినా ఆయనలో సామరస్య ధోరణి లేకపోగా, వాటివల్ల అమెరికా నష్టపోతున్నట్టు చిత్రిస్తున్నారు. అమెరికా వాలకం చూస్తే దానికి నిర్దిష్టమైన వ్యూహాత్మక విధానాలున్నట్టు అనిపించదు. మిత్ర దేశాలు, వాణిజ్య భాగస్వామ్య దేశాలు, దీటుగా పోటీ ఇచ్చే దేశాలు అనే విచక్షణ కనబడదు. నివేదిక చెబుతున్నట్టు నిజంగా ఇవి వచ్చే ఏడాదినుంచి అమల్లోకొస్తే, అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ముందునాటి సుంకాల్ని దాదాపు చెల్లించక తప్పని స్థితి ఏర్పడుతుంది. యూఎస్‌టీఆర్ రెండు నెలలు దర్యాప్తుచేసి, మొన్న మేలో నివేదికఇచ్చింది. కానీ దేశంలో మధ్యంతర ఎన్నికలు, మనీలా శిఖరాగ్రం, షెన్‌జెన్ త్రైపాక్షిక సమావేశం వగైరాలు ముగిశాక ఈ ప్రకటన చేయాలని ట్రంప్ నిర్ణయించుకున్నట్టున్నారు. అమెరికా ఒత్తిళ్ల కారణంగా తప్పనిసరై వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్న ఇండొ నేసియా, మలేసియా తదితర దేశాల్లో పాలకులపై జనం ఆగ్రహోదగ్రులవుతున్నారు. దేశ సార్వభౌమత్వాన్ని కుదువపెట్టారన్న విమర్శలొస్తున్నాయి. వారు దిక్కుతోచని స్థితిలోపడి తమ నిర్ణయంవల్లే అమెరికా సుంకాలు పది పన్నెండు శాతం మించలేదని సర్దిచెప్పుకుంటున్నారు. కానీ తాజా నిర్ణయం అమలైతే ఇవి ఒకేసారి 20 నుంచి 35 శాతానికి ఎగబాకుతాయి. మరి ఆ ఒప్పందాలవల్ల ఏం ప్రయోజనం ఉన్నట్టు? తన వ్యూహం బెడిసికొడుతుందని ట్రంప్ గ్రహించలేకపోతున్నారు. ఆయననిర్ణయంవల్ల అవతలి దేశానికి కలిగే నష్టం మాటేమోగానీ... సరుకుల ధరలు మరింత పెరిగి అమెరికా వ్యాపారుల, వినియోగదారుల నడ్డి విరగడం ఖాయం. బెదిరింపులు, ఒత్తిళ్ల ద్వారా వేరే దేశాలను లొంగదీసి దేశ సంపద పెంచాలని ట్రంప్ అనుకుంటేఅది తెలివితక్కువతనం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది పరస్పర సహకారం, ప్రతి దేశమూ ఎదిగేందుకు తగిన వాతావరణం కల్పించడంలోనే ఉంటుంది తప్పఇలాంటి బెదిరింపులవల్ల కాదు. ఇంతకూ మన ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా, ప్రధాన రంగాలకు బ్యాంకుల రుణ సదుపాయం, చైనానుంచి ముడిసరకు దిగుమతి వగైరాలవల్ల తమ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని నివేదిక అంటున్నది. ఈ వరస చూస్తుంటే ప్రపంచ దేశాలన్నీ తన మోచేతి నీళ్లు తాగి పడివుండాలని అమెరికా భావిస్తున్నట్టు కనబడుతోంది. ట్రంప్ మరో రెండేళ్ల ఏలుబడి ఎప్పుడు ముగుస్తుందాఅని ప్రపంచ దేశాలు ఎదురుచూస్తున్నాయి. ఆ తర్వాతైనా తీరు మారకపోతే అవితమ దారి తాము చూసుకుంటాయి. ఈలోగా అమెరికాకు జ్ఞానోదయమైతే దానికేమంచిది!

Postal Licenced No: HDP/010/2024-2026
భారత్ తెలుగు దినపత్రిక
BHARAT REPORTER రిపోర్టర్

కండరాలకూ జ్ఞాపకాలు!

కండరాలను ఎంత ఉపయోగిస్తే అంత ప్రయోజనం

'ప్రతికూల జ్ఞాపకాల'తో పట్టు సడలే అవకాశం



తెలివితేటలు, జ్ఞాపకశక్తి వంటి మాటలు వినగానే.. అవి మన మెదడు సొత్తే అనుకుంటాం. కానీ, మన శరీరం అంతటా అల్లుకొని ఉండే కండరాలకు కూడా సొంత తెలివితేటలు, జ్ఞాపకాలు ఉంటాయట. ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు గానీ, వాస్తవం. అంతెందుకు..? వ్యాయామం చేస్తే కండరాలు బలంగా పెరుగుతాయని మనకు తెలుసు. అయితే, మానేసిన కొన్నాళ్లకు ఆ విషయాన్ని మనం మర్చిపోవచ్చు. కానీ, కండరాలు మాత్రం మర్చిపోవట. మళ్లీ కొన్నేళ్ల తర్వాత తిరిగి మొదలు పెట్టినా, మన కండరాలు గతంలో కన్నా చప్పున స్పందిస్తాయని అధ్యయనాల్లో తేలింది. కండరాలకూ సొంత తెలివితేటలతో కూడిన జ్ఞాపకాలుంటాయట. మీరు కండరాలను ఎంతగా ఉపయోగిస్తే, అవి మీ శరీరానికి అంత ఎక్కువ శాశ్వత ప్రయోజనకరమైన వనరుగా మారుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. సైకిల్ తొక్కేట ప్పుడు శరీరంలో కండరాలు కలిసికట్టుగా సమన్వయంతో కదలటం నేర్చుకుంటాయి. ఆ చలనశీలతను చిరకాలం పాటు గుర్తుపెట్టుకుంటాయి.

జ్ఞాపకాలతో మరింత వేగంగా!

కండరాల ఎపిజెనెటిక్ జ్ఞాపకశక్తిపై షార్పుల్స్ విశేష పరిశోధనలు చేశారు. ప్రవర్తన, పరిస్థితుల ప్రభావం వల్ల జన్యు వ్యక్తీకరణలో వచ్చే మార్పులను ఎపిజెనెటిక్ మార్పులు అంటారు. అంటే, జన్యువులు మారవు, కానీ అవి పనిచేసే విధానం మారుతుంది. వ్యాయామంతో కలిగే జన్యు వ్యక్తీకరణ మార్పులకు సంబంధించిన జ్ఞాపకాలను కండరాలు చిరకాలం గుర్తుంచుకుంటాయని షార్పుల్స్ పరిశోధనలు రుజువు చేశాయి. కొన్ని నెలలు లేదా ఏళ్ల విరామం తర్వాత మళ్లీ వ్యాయామం ప్రారంభించినప్పుడు పాత జ్ఞాపకాల ఆధారంగా మొదట్లో కన్నా వేగంగా కండరాలు బలం పుంజుకుంటాయని ఆయన కనుగొన్నారు.

చప్పున గుర్తుతెచ్చుకుంటాయి

మన కండరాల్లోని కణాలు.. శరీర కదలికలను, వ్యాయామాన్ని కలకాలం గుర్తుపెట్టుకోగలవు. అవసరమైనప్పుడు వాటిని మళ్లీ చప్పున గుర్తుతెచ్చుకోవటమే కాకుండా మొదట్లో కన్నా చప్పున స్పందించగలవని ఇటీవల వైద్య పరిశోధనల్లో వెల్లడైంది. 'మానవ శరీరంలో అవయవాల చుట్టూ ఉండే కండరాల్లోని కణాలు విలక్షణమైనవి. అవి పొడవుగా, పల్చగా, పోగుల మాదిరిగా ఉంటాయి. నిద్రాణంగా ఉండే ఈ మూల కణాలు శరీర కదలికలు/వ్యాయామం వల్ల వత్తిడి కలిగినప్పుడు లేదా గాయం తగిలినప్పుడు చైతన్యవంతమై కండర వృద్ధికి దోహదపడతాయి. చాలా ఏళ్ల తర్వాత మనం మళ్లీ వ్యాయామం చేసినా గతంలో కన్నా చప్పున స్పందిస్తాయని మా పరిశోధనల్లో తేలింది' అంటారు కండర శాస్త్రవేత్త డా. ఆడమ్ షార్పుల్స్. ఆయన ఓస్లోలోని నార్వేజియన్ స్కూల్ ఆఫ్ స్పోర్ట్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

ప్రతికూల జ్ఞాపకాలు!

కండర కణాలు అన్ని వేళలా 'సానుకూల జ్ఞాపకాల'తోనే స్పందించాలనేం లేదు. ఒక్కోసారి 'ప్రతికూల జ్ఞాపకాల'తోనూ ప్రతిస్పందించవచ్చు. ప్రతికూలతకు వ్యాధి కూడా కారణం కావచ్చు. ఉదాహరణకు.. పదేళ్ల క్రితం రొమ్ము కేన్సర్‌కు చికిత్స పొందిన మహిళల్లో కండరాలు 'ప్రతికూల జ్ఞాపకాల' వల్ల వారి వయసుకు మించి పట్టు సడలి, క్షీణించటాన్ని షార్పుల్స్ గుర్తించారు. వారితో ఏరోబిక్ ఎక్సర్‌సైజులు చేయించినప్పుడు కండరాలు వయసుకు తగిన రీతిలో పున రుజ్జీవనం పొంది పటుత్వం పెంచుకోగలిగాయి. ప్రతికూల జ్ఞాపకాలపై సానుకూల జ్ఞాపకాలు పైచేయి సాధించటం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన అంటారు.

మనిషి 'తిరుగుడు' ఎక్కువైంది!

సంచార గతిని మార్చేసిన పారిశ్రామిక విప్లవం
సగానికి పడిపోయిన జలచరాల సంచారం..
40 రెట్లు పెరిగిన మానవుల కదలికలు



స్పెషల్ డెస్క్: 1850ల నాటి మాట... అప్పట్లో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలంటే నడకే ప్రధాన సాధనం. కానీ, 2025 నాటికి పూర్తిగా పరిస్థితి మారిపోయింది. ఎక్కడికైనా వెళ్లాలంటే కార్లు, బస్సులు, మోటారు సైకిళ్లు, రైళ్లు, విమానాలు.. ఇలా ఎన్నో మార్గాలు. అందుకే, ఇప్పుడు నడక అనేది ఏకంగా ఏడో స్థానానికి వెళ్లిపోయింది. భూమిపై ఉన్న జలచరాల సంచారం (టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్ - టీబీఎం) పారిశ్రామిక విప్లవం తరువాత.. సగానికి తగ్గిపోయింది. అదే సమయంలో మనుషులు అటూ ఇటూ తిరగడం 40 రెట్లు పెరిగింది. సుప్రసిద్ధ నేచర్ జర్నల్‌కి చెందిన 'నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్' విభాగంలో ప్రచురితమైన అధ్యయనం ఈ ఆసక్తికర వివరాలు వెల్లడించింది. భూమిపై జలచరాల సంచారం (టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్ - టీబీఎం) పారిశ్రామిక విప్లవం తరువాత తగ్గిపోవడానికి (ప్రధాన కారణం.. చేపలు, తిమింగలాలను మనుషులు వేటాడటమే. చెప్పాలంటే మొత్తం మానవుల టీబీఎంలో.. భూమిపై ఉన్న జంతువులు, జలచరాలు, పక్షుల టీబీఎం ఆరోవంతు మాత్రమేనట. ప్రస్తుతం మానవ సంచారంలో దాదాపు 65 శాతం.. మోటారు వాహనాల ద్వారానే జరుగుతోంది. నడక ద్వారా 20 శాతం ఉంటే.. సైకిల్ ద్వారా జరుగుతున్నది మరో 20 శాతం. విమానాల ద్వారా తిరుగుతున్నవారు 10 శాతం కాగా, రైల్వేల ద్వారా ప్రయాణిస్తున్నవారు 5 శాతం.

ఆ నాలుగూ కారణం

ఈ అధ్యయనంలో అమెరికా, జర్మనీ, ఇజ్రా యెల్‌కు చెందిన శాస్త్రవేత్తలు పాలుపంచుకున్నారు. వీరు మానవ ప్రయాణాలు పెరగడానికి కార ణాలుగా ప్రధానంగా 4 అంశాలను పేర్కొన్నారు.

జనాభా పెరుగుదల,,మోటారు వాహనాల వాడకం పెరగడం ,శిలాజ ఇంధనాల వినియోగంలో వృద్ధి,ప్రయాణాలకు అనువైన సదుపాయాలు, సౌకర్యాల ఏర్పాటు,అధిక ఆదాయ దేశాల్లో ఉన్నవారు ప్రపంచ జనాభాలో దాదాపు 16 శాతం. మొత్తం జనాభా కదలికల్లో వీరిదే దాదాపు 30 శాతం.,అల్పాదాయ దేశాల్లో ఉన్న వారు ప్రపంచ జనాభాలో 9 శాతం. మొత్తం జనాభా సంచారంలో వీరి వాటా కేవలం 4 శాతమే.

95 శాతానికి పెరిగింది

1850లలో..ఈ భూమిపై మొత్తం క్షీరదాల్లో క్రూర మృగాల (జలచరాలు, వన్యప్రాణులు) బరువు 50 శాతం ఉంటే.. మానవులు, ఇతర పెంపుడు జంతువుల బరువు 50 శాతం ఉండేది. 2020 నాటికి మానవులు, ఇతర పెంపుడు జంతువుల బరువు ఏకంగా 95 శాతానికి పెరిగిపోయింది.

ఏమిటీ టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్

మనుషుల జనాభాతో పోలిస్తే భూమిపై పక్షులు, జంతువులు చాలా ఎక్కువ కదా, మరి అవి ప్రయాణించే దూరం కంటే మనుషులు ప్రయాణించే దూరం ఎక్కువ కావడం ఏమిటి? అనే సందేహం చాలామందికి వస్తుంది. అందుకు ప్రధాన కారణం దీన్ని గణించడానికి తీసుకునే ప్రమాణమే. పర్యావరణ ఆరోగ్యం, సహజ వనరుల వినియోగం, పర్యావరణంపై మానవుల ప్రభావం వంటి అంశాలు అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలు 'టోటల్ బయోమాస్ మూవ్‌మెంట్'ను ఉపయోగిస్తారు. దీని ప్రమాణమే గ్రాస్ టన్ను కిలోమీటర్లు (జీటీకే). ఒక ప్రాణి బరువును, అది ఒక ఏడాదిలో ప్రయాణించిన దూరంతో గుణిస్తే వచ్చేదే జీటీకే. ఎంత ఎక్కువ బరువు ఉంటే అంత ఎక్కువ జీటీకే అన్నమాట. చాలా పక్షులు ఏటా కొన్ని వేలు, లక్షల కిలోమీటర్లు వలస పోతుంటాయి. కానీ వాటి బరువు చాలా తక్కువగా ఉండటం వల్ల వాటి టీబీఎం చాలా తక్కువగా ఉంటుంది.

యూపీఐ లావాదేవీల్లో గుత్తాధిపత్యం!

రెండు సంస్థల చేతుల్లోనే 80 శాతం వాటా

దీన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి

ఆర్థిక శాఖ, ఆర్‌బీఐని కోరిన ఐఎఫ్ఎఫ్



న్యూఢిల్లీ: యూపీఐ లావాదేవీల్లో 80 శాతాన్ని కేవ లం 2 సంస్థలు (ఫోన్‌పే, జీపే) నియంత్రిస్తున్నాయంటూ.. ఈ ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు చ ర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ, ఆర్‌బీఐని ఇండి యా ఫిన్‌టెక్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్) కోరింది. ఫిన్ టెక్ పరిశ్రమకు స్వీయ నియంత్రణ మండలిగా వ్య వహరిస్తున్న ఐఎఫ్ఎఫ్.. ఇందుకు సంబంధించి వి ధాపరమైన సూచనలు చేసింది. ఐఎఫ్ఎఫ్‌లో భాగమైన ఫిన్‌టెక్ సంస్థలతో విస్తృతమైన సంప్రదింపుల అనంతరం వీటిని రూపొందించినట్టు తెలిపింది. యూపీఐపై 30 థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు (టీపీఏపీలు) ఉండగా.. 80 శాతానికిపైగా లావాదేవీలు రెండు సంస్థల నియంత్రణల్లోనే ఉన్నాయి. ఈ రెండు సంస్థలు దోపిడీ ధరలతో (భారీ తగ్గింపులు, క్యాష్ బ్యాక్ ఆఫర్లు)తమ ఆధిపత్యాన్ని కాపాడుకుంటాయి. ముఖ్యంగా చిన్న సంస్థలు, దేశీ పోటీదారులను పోటీపడకుండా చేస్తాయి. ప్రభుత్వానికి చెందిన భీమ్ ప్లాట్‌ఫామ్ సైతం ఈ ద్వందాధిపత్యం దెబ్బకు మార్కెట్ వాటాను కోల్పోయింది. యూపీఐ లావాదేవీలను నగదుగా మార్చుకునే అవకాశం (ఎండీఆర్ చార్జీలు) లేకపోవడం, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలకు ఉన్న నిధుల వెసులుబాటు.. కొత్త సంస్థలు, చిన్న సంస్థల ప్రవేశానికి గట్టి అవరోధంగా నిలుస్తాయి. పోటీని అణచివేస్తాయి. ఒక సంస్థ గరిష్టంగా 30 శాతం లావాదేవీలకే సేవలు అందించాలన్న పరిమితిని అమలు చేయడంలో ఎన్‌పీసీఐ జాప్యం చేస్తుండడం నిర్వహణపరమైన సవాళ్లను, ఏకాగ్రత రిస్క్‌ను తెలియజేస్తుంది. ఎన్‌పీసీఐ ఈ పరిమితి అమలు చేయడానికి ముందుగానే ఈ సంస్థలు మరింత పెద్దవిగా అవతరించేందుకు అనుమతించడం.. వ్యూహాత్మకమే అనిపిస్తోంది. ఈ ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు బడా రెండు యూపీఐ సంస్థలు (టీపీఏపీలు) కాకుండా మిగిలిన వాటికి యూపీఐ ప్రోత్సాహకాల్లో అధిక వాటా అందుకునేలా చర్యలు తీసుకోవాలి. లేకపోతే సదరు రెండు అతిపెద్ద టీపీఏపీలు ప్రోత్సాహకాల్లో అధిక భాగాన్ని పొందుతాయి. ఒక టీపీఏపీకి ప్రోత్సాహకాల్లో 10 శాతం గరిష్ట పరిమితి విధించాలి.

దేశంలో డేటా సెంటర్ల దూకుడు..
త్వరలోనే డబుల్..



ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకుంటే దేశీయంగా డేటా సెంటర్ల (డీసీ) సామర్థ్యం 2027 నాటికి రెట్టింపు కానుంది. ప్రాజెక్టులను వేగవంతం చేస్తే 2030 నాటికి అయిదు రెట్లకు పెరగనుంది. డేటా లోకలైజేషన్ చట్టాలు, సానుకూల నియంత్రణ విధానాలు, ప్రభుత్వాల నుంచి సబ్సిడీలు, క్లౌడ్ వినియోగం పెరుగుతుండటం మొదలైన అంశాలు ఇందుకు దోహదపడనున్నాయి. మెక్వారీ ఈక్విటీ రీసెర్చ్ ఒక నివేదికలో ఈ విషయాలు వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం భారత్‌లో 1.4 గిగావాట్ల డీసీ సామర్థ్యం ఉండగా, 1.4 గిగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. మరో 5 గిగావాట్లు ప్రణాళిక దశలో ఉన్నాయి. టెక్ దిగ్గజం గూగుల్ వచ్చే అయిదేళ్లలో భారత్‌లో 15 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీనికి తోడు టీసీఎస్ సైతం 6.5 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుండగా, మెటా-గూగుల్ భాగస్వాములుగా జామ్‌నగర్‌లో సమగ్ర ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జియో ఇటీవల ప్రకటించింది. అలాగే ఏడబ్ల్యూఎస్ భారత్‌లో క్లౌడ్ కెపాసిటీని 2030 నాటికి 13 బిలియన్ డాలర్స్ పెట్టుబడులు పెట్టనుంది.

ఈవీలకు 'చార్జింగ్' పెంచాలి!

- ప్రతి వెయ్యి ఈవీలకు 5 చార్జింగ్ స్టేషన్లే
- అమెరికా, చైనా, నార్వేలతో పోలిస్తే తక్కువే
- దేశంలోని 30వేల స్టేషన్లలో పనిచేస్తున్నవి సగమే
- 2030 నాటికి దేశంలో 1.32 లక్షల స్టేషన్లు అవసరం



2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబర్) దేశంలో 91,726 విద్యుత్ వాహనాలు (ఈవీ) అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే సమయంలో అమ్ముడైనవి 44,172 మాత్రమే. కానీ ఇందుకు తగ్గట్టుగా చార్జింగ్ స్టేషన్లు పెరగడం లేదు. ఈ ఏడాది ఆగస్టు నాటికి దేశంలోని పబ్లిక్ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య 30లు. ఇందులో పనిచేస్తున్నవి 14,450. దేశంలో ఈవీలు పెరుగుతున్నంత వేగంగా చార్జింగ్ స్టేషన్లు పెరగడం లేదు. ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫడా) గణాంకాల ప్రకారం.. 2024-25లో మొత్తంగా అమ్ముడైన ఈవీలు 1.1 లక్షలు. అదే, ఈ ఆర్థిక సంవత్సరం ఆరు నెలల్లోనే అమ్మకాలు 90 వేల మార్కును దాటేశాయి. 2014-15లో మొత్తం కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లలో ఈవీల వాటా కేవలం 0.01 శాతం. అదే 2024-25లో 7.31 శాతం. కానీ ఇందుకు తగ్గట్టుగా పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లు పెరగడం లేదు. 2021-22లో దేశంలో ఉన్న స్టేషన్లు 1,800. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఇవి 30 వేలకు పెరిగాయి. ఇందులో 15,550 పనిచేయడం లేదు.



ప్రతి 50 కి.మీ.కి ఒకటి

కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ నాటికి దేశంలోని 91 శాతం జాతీయ రహదారుల్లో ప్రతి 50 కిలోమీటర్లకు కనీసం ఒక ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్ ఉంది. ప్రపంచంలోని అగ్ర దేశాలతో పోలిస్తే మనదేశంలో చార్జింగ్ స్టేషన్లు, అందులోనూ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్ల సంఖ్య తక్కువే. చైనాలో ప్రతి 100 కిలోమీటర్లకు 100 స్టేషన్లు ఉన్నాయి. అమెరికాలో ఈ సంఖ్య 70. అత్యధికంగా నార్వేలో 100 కి.మీ.కి 180 ఉన్నాయి. చైనాలోని ప్రతి 1,000 స్టేషన్లలో 45 శాతం ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లు. ఈ సంఖ్య నార్వేలో అత్యధికంగా 70 శాతం.

స్టేషన్లు - సమస్యలు

నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల చాలా ఈవీ చార్జర్లు సరిగ్గా పనిచేయడం లేదని కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 90 శాతం ఈవీల చార్జింగ్ ఇంటి దగ్గర లేదా పనిచేసే ప్రదేశాల్లోనే జరుగుతోంది. మెట్రో నగరాలు కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉండే చార్జింగ్ స్టేషన్ల వినియోగం తక్కువగా ఉంటోందని, అందువల్ల తాము పెట్టిన పెట్టుబడులు కూడా గిట్టుబాటు కావడం లేదని కంపెనీలు అంటున్నాయి.

72,300 స్టేషన్ల లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం ఈవీలను ప్రోత్సహించడానికి ఫేమ్ 2 కింద ఇప్పటికే 7,400 స్టేషన్ల ఏర్పాటులో తోడ్పాటు అందించింది. మొత్తంగా దేశ వ్యాప్తంగా 72,300 స్టేషన్లు ఏర్పాటుచేయాలన్నది కేంద్రం లక్ష్యం. ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ రెడ్‌సీర్ నివేదిక ప్రకారం.. 2030 నాటికి దేశంలో 1.32 లక్షల స్టేషన్లు అవసరమవుతాయి. సగటున ప్రతి 1,000 ఈవీలకు 45-50 ఉండాలి. మెట్రోల్లోనే 62 శాతం దేశంలోని చార్జింగ్ స్టేషన్లలో సుమారు 62 శాతం ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లోనే ఉన్నాయి. కానీ, ఈవీల అమ్మకాలు పెరుగుతున్న మెట్రోయేతర నగరాల్లో మాత్రం 38 శాతమే ఉన్నాయి. ఎంట్రీ లెవెల్ కార్ల అమ్మకాల్లో సగానికిపైగా టాప్ - 20 నగరాల్లో కాకుండా.. బిహార్, ఆంధ్రప్రదేశ్, యూపీ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని చిన్న నగరాల్లోనే జరగడం గమనార్హం.

చార్జింగ్‌కు పనికిరావడం లేదు. ఆయా కంపెనీల కార్లకు సంబంధించిన యాప్స్, చెల్లింపు వ్యవస్థలు

తిండిలోనే ఉంది.. తూగుటయ్యాల!

సుఖనిద్రకు ఆహ్వానం

పండ్లు, కూరగాయలు రెప్పల్ని వాల్చేస్తాయి

వేపుళ్లు, కారాలు నిద్రను తరిమేస్తాయి

స్పెషల్ డెస్క్: పగటి పూట పండ్లు, కూరగా యలు, సంక్లిష్ట (నెమ్మదిగా జీర్ణమయ్యే) కార్బోహైడ్రేట్‌లను తీసుకునే వారు కలతలు లేని, ప్రశాంతమైన నిద్రను ఆస్వాదిస్తున్నారట. అందుకు భిన్నంగా - చక్కెర, ప్రాసెస్ చేసిన పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాలు.. శారీరక అసౌకర్యానికి, నిద్రాభంగానికి కారణం అవుతున్నాయట. ప్రముఖ జర్నల్ 'స్లీప్ హెల్త్'లో తాజాగా ప్రచురితమైన అధ్యయనం ఈ విషయాలు వెల్లడించింది. నిద్రలేమికి ఒత్తిడి, గంటల తరబడి స్క్రీన్‌ను చూడటం, క్రమరహితమైన పని వేళలు ప్రధాన కారణాలుగా ఉన్నప్పటికీ... నిద్రను నియంత్రించటంలో ఆహారం బలమైన సహాయక పాత్రను పోషిస్తుంది. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి వాటితో కూడిన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు.. శరీర ధర్మాల సహజ లయను నిర్వహించడానికి, వాపుల గుణాన్ని తగ్గించడానికి, జీర్ణక్రియకు, తద్వారా మంచి నిద్రకు దోహదపడతాయని అధ్యయనంలో తేలింది. రోజుకు ఏడు నుంచి తొమ్మిది గంటలు నిద్రించే అమెరికన్ యువతపై ఈ అధ్యయనం జరిగింది. ఆహారం నిద్రను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోటానికి వారి ఆహారపు అలవాట్లను, మణికట్టుకు అమర్చే నిద్ర మానిటర్‌ల రీడింగ్‌లను అధ్యయనవేత్తలు పరిగణనలోకి తీసుకున్నారు.

మంచి ఆహారంతో

చక్కెర, ప్రాసెస్డ్ పదార్థాలు అధికంగా ఉన్న ఆహారాలు అసౌకర్యాన్ని, రాత్రిపూట తరచూ మెలకువ రావటానికి కారణం అవుతున్నాయి. కొన్ని ఆహారాలు సహజంగా నిద్ర నాణ్యతను పెంచుతున్నాయి. అరటిపండ్లు, కివీ పళ్లు, టార్ట్ చెర్రీస్ (పుల్లటి చెర్రీలు) సహజ మెలటోనిన్‌ను, సెరటోనిన్ కలిగి, నిద్ర స్పందనలను నియంత్రిస్తున్నాయి. పాలకూర, క్యాబేజీ రకం ఆకుకూరలలోని మెగ్నిషియం కండరాలను సడలిస్తోంది. గింజలు, అవకాడోలు, చిలగడదుంపలు నిద్ర హార్మోన్లను సమతులం చేయడంలో సహాయకారిగా ఉంటున్నాయి.

సమయమూ ముఖ్యమే

ఆహారంతో పాటుగా, అది తీసుకునే సమయం కూడా నిద్రకు చాలా ముఖ్యం. ఆలస్యంగా తీసుకుంటే ఆరోగ్యకరమైన ఆహారాలు కూడా నిద్రకు ఆటంకం కలిగిస్తాయి. అధిక ప్రొటీన్‌లు లేదా కారంగా ఉండే వంటకాలు అజీర్ణాన్ని రేకెత్తిస్తాయి. కెఫిన్, డార్క్ చాక్లెట్ నిద్రను ఆలస్యం చేస్తున్నాయి. మధ్యాహ్న భోజనాన్ని సమృద్ధిగా తీసుకోవాలి. అది జీర్ణక్రియ బలంగా ఉండే సమయం. రాత్రి భోజనం తేలికగా, సమతులంగా ఉండాలి, రాత్రి 8 గంటలలోపు, లేదా నిద్రవేళకు కనీసం 2 గంటల ముందు తినటం పూర్తి చేయాలి. పడుకునే ముందు ఒక చిన్న చిరుతిండి, అరటిపండు, గోరువెచ్చని పాలు లేదా నానబెట్టిన బాదం తినటం వల్ల అర్ధరాత్రి ఆకలిగా అనిపించదు.

'ప్రశాంత పోషకాలు'

ట్రిప్టోఫాన్ అనే అమైనో ఆమ్లం అధికంగా ఉండే ఆహారాలు.. పాలు, గింజలు వంటివి. ఇవి నిద్ర హార్మోన్లను తయారు చేయటంలో కీలకం మెగ్నిషియం,విటమిన్‌బి6..ఆకుకూరలు, అరటిపండ్లు, అవకాడోలలో లభిస్తాయి. కండరాలను, నరాలను సడలించి విశ్రాంతినిస్తాయి. మెలటోనిన్ (రాత్రివేళల్లో మెదడులో ఉత్పత్తి అయ్యే హార్మోన్) అధికంగా ఉండే ఆహారాలు.. చెర్రీలు, ఓట్స్, కివీ, అరటిపండ్లు. ఇవి నాణ్యమైన నిద్రకు తోడ్పడతాయి. పొటాషియం అధికంగా ఉండే టమాటా,చిలగడదుంపలు నిద్ర లయల్ని స్థిరీకరిస్తాయి.

నిద్రాభంగం కలిగించేవి

రాత్రి కడుపునిండా తినటం, ఆలస్యంగా తినటం, వేపుళ్లు, కారాలు.. జీర్ణక్రియను ఆలస్యం చేస్తాయి. కలత నిద్రకు కారణం అవుతాయి. కెఫిన్, ఆల్కహాల్, చక్కెరలు మెలటోనిన్‌ను అణిచివేస్తాయి. నిద్రా భంగం కలిగిస్తాయి. నిమ్మజాతి పండ్లు లేదా అధిక ప్రొటీన్‌లు కలిగిన ఆహారాలు కూడా, బాగా పొద్దుపోయాక తింటే నిద్రకు ఆటంకం కలిగిస్తాయి.



PRINTED. "EDITOR... PUBLISHED AND OWNED BY : P. JAYARAJU PRINTED AT. SMILE GRAPHICS & PRINTERS 41-289– 2 KOTHAPETA KURNOOL (Dist) ANDHRA PRADESH PUBLISHED FORM : PERUMALA JAYARAJU 5 – 40 MILITARY COLONY NANDANAPALLE. Dist.KURNOOL. ANDHRA PRADESH 518452: EDITOR : P. JAYARAJU : RNI No.APTEL/2018/76727 Cell No. 9849366709 Email : perumalajayaraju123@gmail.com